

మోటుపల్లికి మహర్దశ



◆ గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నౌక తయారీ కేంద్రం ఏర్పాటుపై ఆశలు ◆ గతంలో కేంద్ర బృందం అనుకూలంగా నివేదిక ◆ తాజాగా కేంద్ర మంత్రి సానుకూల స్పందన ◆ రెండు కీలక ప్రాజెక్టులు ముందడుగుపై ప్రజల హర్షం

కేంద్ర బృందం పరిశీలించిన మోటుపల్లి తీర ప్రాంతం (ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాల్లో ఓడల తయారీ క్లస్టర్ల ఏర్పాటుకు ఏడు నెలల క్రితం కేంద్రం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు అనువైన ప్రాంతం పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండల పరిధిలో ఉందనే అభ్యర్థనలను స్థానిక నాయకత్వం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఆ వినతులను కేంద్రం ముందుంచింది. చినగంజాం మండలంలోని మోటుపల్లిలో పెద్దఎత్తున ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండడంతో పాటు పక్కనే సముద్ర తీరం ఉందని ఓడల తయారీ క్లస్టర్ నిర్మాణానికి కలిసొచ్చే అంశంగా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. ఈ నేపథ్యంలో గతేడాది అక్టోబరులోనే కేంద్ర బృందం మోటుపల్లి తీరంలో పర్యటించి నివేదికలను రూపొందించింది. దీనికి కొనసాగింపుగా నౌక నిర్మాణ పరిశ్రమ ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలతో నివేదిక ఇవ్వాలని మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ఇటీవలే అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలోనే మోటుపల్లి-పెదగంజాం మధ్య ఉన్న తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు కూడా నిర్మించాలనే అభ్యర్థనలు కూడా పెద్ద సంఖ్యలో కేంద్రానికి అందాయి. మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి ఈ విషయమై కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ను బుధవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. గతంలో కేంద్ర బృందం ఇక్కడ పర్యటించిందనే విషయాన్ని గుర్తు చేయడంతో పాటు మారిటైం బోర్డు సానుకూలంగా ఇచ్చిన నివేదికలను సైతం కేంద్రమంత్రికి ఆయన అందజేశారు. ఈ అభ్యర్థనలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని, మోటుపల్లెలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుతో పాటు నౌక నిర్మాణ కేంద్రాలకు అనుకూలంగా ఉంటుందనే విశ్వాసాన్ని రాష్ట్ర మంత్రి జనార్థన్‌రెడ్డి వ్యక్తం చేశారు. రెండు కీలక ప్రాజెక్టుల విషయంలో ముందడుగు పడడంతో పర్చూరు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అటు పారిశ్రామికంగా, ఇటు పర్యాటకంగా కూడా త్వరలోనే మోటుపల్లికి మహర్దశ దక్కే సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి



ఢిల్లీలో కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

అనుకూలతలు..

- నౌక నిర్మాణ పరిశ్రమ ఏర్పాటుకు 1300 ఎకరాలు, పోర్టుకు మరో 600 ఎకరాల వరకు కావాలి. ఈ స్థాయిలోనే ప్రభుత్వ భూమి మోటుపల్లి తీరంలో అందుబాటులో ఉంది.
- బకింగ్‌హామ్ కెనాల్‌కి సమీపంగానే సముద్రం ఉంది.
- నౌకల నిర్మాణం పూర్తి కాగానే వాటిని సముద్ర మార్గం ద్వారా ఆయా రాష్ట్రాలు, దేశాలకు తరలించడానికి ఈ ప్రాంతం అనుకూలం.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి

కీలకమైన ఈ రెండు ప్రాజెక్టులను మోటుపల్లి తీరంలో ఏర్పాటు చేసే విధంగా కేంద్రాన్ని ఒప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. నౌక నిర్మాణ పరిశ్రమపై కేంద్రం బృందం ఇచ్చిన నివేదికలు కూడా అనుకూలంగానే ఉండడంతో నిర్మాణ క్లస్టర్ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగాయని సమాచారం. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు విషయంలో మాత్రం కేంద్ర బృందం పరిశీలన తర్వాతనే ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. త్వరలోనే కేంద్ర బృందం చినగంజాం మండలంలో పర్యటించి గ్రీన్‌ఫీల్డ్ పోర్టును మోటుపల్లి తీరంలో ఏర్పాటు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించనుంది. ఇటీవలే మోటుపల్లి తీరంలో పర్యటించిన కలెక్టర్ వెంకటమురళి ఆక్రమణలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలని కూడా ఆదేశించారు. నౌక నిర్మాణ పరిశ్రమ, పోర్టు నిర్మాణాలకు ఉన్న అనుకూలతలపై కేంద్రానికి వివరించడంలో రాష్ట్ర ప్రభుత్వం సఫలీకృతమైంది. పర్యాటకంగా మోటుపల్లిని అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కాకతీయులు, చోళ రాజుల నాటి శాసనాలు, పంచలోహాలను చినగంజాంలో భద్రపరచడానికి మ్యూజియం నిర్మాణం చేపట్టి పర్యాటకులను ఆకర్షించే దిశగా కూడా కృషి చేస్తామన్నారు.

జడ్పీకి.. బకాయిల భారం

రావాల్సిన అద్దెలు 1.22 కోట్లు

అతిథిగృహాల్లో పేరుకుపోయిన బాకీలు

వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్

8

మిర్చియార్డులో కొన్ని కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ లైసెన్సులు

● మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత

- గుంటూరులో బయ్యర్ల బినామీ వ్యాపారం
- ఒక్క కేంద్రంలోనే 1.80 లక్షల క్వింటాళ్లు కొనుగోలు
- క్వాలిటీ, స్టాండెడ్ కటింగ్ పేరుతో కోత.. కొందరికి రూ.3 కోట్లు లబ్ధి

సీసీఐలో..

కొను గోల్‌మాల్

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

కొందరు బయ్యర్లు అత్యధికంగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. రైతులకు మేలు చేసేందు కోసం కొనుగోలు చేస్తున్నారని అందరూ అనుకున్నారు. తీరా అసలు విషయం చూస్తే.. ఇదో పెద్ద కొను'గోల్‌మాల్' అని తేలింది. వారి అసలు గోల్ (లక్ష్యం) అర్థమయ్యాక అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. గుంటూరు పరిధిలోని సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల్లో భారీ అక్రమాలు చోటు చేసుకు న్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఒకే ఒక్క కేంద్రంలో అధికంగా కొనుగోళ్లు జరిగినట్లు వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. జిన్నింగ్ మిల్లులు యజమానుల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని గాయత్రీ కాటన్ ప్రొడక్ట్స్, శ్రీ సాయి ట్రేడర్స్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పత్తి కొనుగోలుకు ఇద్దరు బయ్యర్లు మారారు. గాయత్రీ కాటన్ ప్రొడక్టులో అతి తక్కువగా 4626.75 క్వింటాళ్లు, శ్రీ సాయి ట్రేడర్స్‌లో 20281 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. అతి తక్కువగా పత్తి కొనుగోలు చేయడం వల్ల యార్డుకు వచ్చిన ఆదాయం కూడా కేవలం రూ.17 లక్షలు మాత్రమే. ఇదే మిల్లులకు అతి సమీపంలో గుంటూరు-ఏ, గంపలగూడెం యార్డులకు చెందిన జిన్నింగ్ మిల్లుల్లో భారీగా కొనుగోలు జరిగింది. ఇక్కడ వేరే వ్యక్తులు మిల్లులు అద్దెకు తీసుకుని జిన్నింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేంద్రాల వెనుక బయ్యర్ల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ జరిగిన పత్తి కొనుగోళ్లు పరిశీలిస్తే ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కేంద్రాలకు ఎంత అన్యాయం జరిగిందో అర్థం అవుతుంది. ఉదాహరణకు గంపలగూడెం యార్డు పరిధిలోకి వచ్చే ఓ మిల్లులో 87448.16 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయగా, మరో కేంద్రంలో ఏకంగా 1.17 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఒకే ఒక్క కేంద్రంలో సుమారు రూ.86 కోట్ల విలువ చేసే పత్తిని కొన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గుంటూరు -ఏ కేంద్రాల్లో కూడా ఇదే రీతిలో కొనుగోళ్లు జరిగాయి. వాస్తవానికి జనవరి నెలకు పత్తి రావడం పూర్తిగా తగ్గిపోతుంది. అయితే ఆశ్చర్యంగా గుంటూరు- ఏ, గంపలగూడెం కేంద్రాల్లో అన్ సీజన్‌లో కూడా 5 వేల క్వింటాళ్లకు తగ్గకుండా పత్తిని కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.

తెర వెనుక ప్రయోజనం వేరు..

కొన్ని సీసీఐ కేంద్రాల్లో పత్తి ఎక్కువగా కొనుగోలు చేయడంలో తెరవెనుక దాగిన ప్రయోజనాలు మాత్రం వేరుగా ఉన్నాయి. ఎక్కడైతే ఎక్కువ పత్తి కొనుగోలు జరిగిందో అక్కడ క్వాలిటీ, స్టాండెడ్ కటింగ్ పేరుతో కోత బాగా విధించారు. ఆయా కేంద్రాల్లో క్వింటాల్‌కు 5 కిలోల నుంచి 7 కిలోల వరకు కోత విధించారు. ఈ లెక్కన ఒక్క బయ్యర్ 1.80 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తే ఎంత మిగులు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలా పక్కకు తీసిన పత్తి జిన్నింగ్ వేయగా వచ్చిన దూదిని విక్రయించారు. ప్రస్తుతం ఆరోపణలు వస్తున్న ఆయా కేంద్రాల్లో కొందరికి సుమారు రూ.3 కోట్ల వరకు అదనపు లాభాలు వచ్చినట్లు ఆరోపణలున్నాయి.

రైతులు, వ్యాపారులకు ఎంతో మేలు

ఎగుమతి, దిగుమతులు సులభతరం

గూడ్స్‌ను ప్రారంభించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్లలోనూ రైల్వేరాక్

బాపట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో రైల్వేరాక్ మూమెంట్ రావడం హర్షణీయమని కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. గురువారం బాపట్ల రైల్వేస్టేషన్‌లో రైల్వేరాక్ లోడింగ్, అన్‌లోడింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేరాక్‌తో జిల్లా రూపురేఖలు మారుతాయన్నారు. గతంలో చీరాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై బాపట్ల నుంచే ధాన్యం, ఇతర సరుకులు ఎగుమతి, దిగుమతి చేసుకోవచ్చన్నారు. దీనివల్ల రైతులు, వ్యాపారులకు రవాణా ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. బాపట్ల వ్యవసాయాధారిత జిల్లా కాబట్టి ఇక్కడి వారికి ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ పంటలు విస్తారంగా పండే జిల్లా కేంద్రంలో లోడింగ్, అన్‌లోడింగ్ పాయింట్ రావడం వల్ల రైతులు, వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గూడ్స్ రాక్‌ల ద్వారా నిత్యావసరాలు, ఎరువులు, దిగుమతి, ఎగుమతి చేసుకోవచ్చన్నారు. బాపట్ల స్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్టాప్ కోసం వినతులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బాపుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, రైల్వేస్టేషన్ మాస్టర్ మీనా, బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోళ్ళపూడి శివరామప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ఫరీద్‌మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల రైల్వేస్టేషన్‌లో గూడ్స్‌రైలును ప్రారంభిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, బాపుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు తదితరులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (శుక్రవారం ఉదయం)

సహరి : 4.55 (శనివారం ఉదయం)



● అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

● గత ఆడిట్‌లో వెలుగుచూసిన అక్రమాలు

● రుణాల పేరిట బ్యాంకు సొమ్ము దారిమళ్లింపు

● రూ.425 కోట్లు గల్లంతు.. మొండిబకాయిలంటున్న అధికారులు

● బ్యాంకు శాఖల్లో అందుబాటులో లేని రుణ గ్రహీతల వివరాలు

● 2022లో సీఐడీ విచారణపై లేఖ.. నాడు అడ్డుకున్న వైసీపీ నేతలు

జీడీసీసీసీపై.. సభా సంఘం

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో గుంటూరు డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(జీడీసీసీ)ను నిలువునా దోచేశారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ బ్యాంకు సొమ్ము అందిన కాడికి కాజేశారు. అధికారం అండ.. పాలకవర్గం, అధికారుల సహకారంతో అక్రమార్కులు చెలరేగిపోయారు. ఆయా అక్రమాలను గుర్తించినా విచారణలకు అక్రమార్కులు అడ్డుతగులుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో నాడు అధికారాన్ని అడ్డంపెట్టుకుని జీడీసీసీబీని అడ్డంగా దోచేసిన అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. జీడీసీసీబీ అక్రమాలపై సభా సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. దీంతో జీడీసీసీబీలో గత ఐదేళ్లలో అక్రమాలకు పాల్పడిన రాజకీయ నేతలు, అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జీడీసీసీబీలో జరిగిన ఎన్నో అక్రమాలు గత ఆడిట్ నివేదికలోనే వెలుగుచూశాయి. జీడీసీసీ అక్రమాలపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఫిర్యాదుతో ప్రభుత్వం సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా సహకార శాఖ అధికారిని నియమించారు. ఈ విచారణపై కూడా అందరూ పెదవి విరిచారు. దాని వల్ల అక్రమాలు బయటకు రావని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో సభా సంఘం ఏర్పాటుకు అడుగు పడింది. కొందరు వైసీపీ నేతలు బినామీలు, నకిలీలను అడ్డంపెట్టుకుని రుణాల పేరట జీడీసీసీ, సహకార సంఘాల్లో వందల కోట్లు దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం సభా సంఘం వేయడంతో అక్రమార్కులపై ఈ సారి తప్పకుండా చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎన్నెన్నో అక్రమాలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 42 జీడీసీసీ బ్యాంకు శాఖలు, 167 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు రూ.425 కోట్లు గల్లంతైనట్లు గత ఆడిట్‌లో నిర్ధారించారు. అధికారులు వీటిని మొండిబకాయిలు అని చెబుతున్నారు. అయితే ఆయా రుణ గ్రహీతల వివరాలు బ్యాంకులో అందుబాటులో లేకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. గుంటూరు పరిసర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజ్‌లు, ఇతర వ్యాపార సంస్థలను అడ్డంపెట్టుకుని రుణాల పేరిట నాటి అధికార పార్టీ నేతలు బ్యాంకు సొమ్ము దారిమళ్లించారని తెలుస్తోంది. జీడీసీసీ బ్యాంకుతో పాటు, సహకార సంఘాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు 2022లోనే అధికారులు గుర్తించారు. అప్పుడే ఓ అధికారి ఆయా అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్లు సమాచారం. అయితే ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన ప్రముఖ నేతలు సీఐడీ విచారణకు అడ్డుతగిలినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం మారిన తర్వాత జీడీసీసీ వేదికగా సాగిన నకిలీ రుణాల బాగోతాలు అనేకం వెలుగులోకి వచ్చాయి.

గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, నల్లపాడు, రెడ్డిపాలెం, గోరంట్ల, కాకుమాను, పెదనందిపాడు, పల్నాడు జిల్లాలోని గురజాల తదితర ప్రాంతాల్లో ఒకరి పేరుతో వేరొకరు రుణాలు పొందినట్లు వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నకిలీ సభ్యుల పేరిట రూ.10.68 కోట్లు రుణాల రూపేణా దారిమళ్లించినట్లు తేలింది. 17 సహకార సంఘాల్లో 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో ఈ తంతు కొనసాగింది. రెడ్డిపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాల మంజూరు పేరట జరిగిన అక్రమాలపై సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, డివిజనల్ సహకార అధికారి విచారణ జరిపారు. ఇక్కడ కమిటీ అనుమతి లేకుండానే 55 మంది నకిలీలను సభ్యులుగా చేర్చుకుని వారిలో 50 మందికి సీసీ, కేసీసీ రుణాలు రూ.2.99 కోట్లు మంజూరు చేశారు. మాచవరం మండలంలోనూ ఇదేవిధంగా జరిగింది. ఈ అక్రమాల్లో జీడీసీసీ బ్యాంకు అధికారులు, సహకార సంఘాల్లోని సిబ్బంది పాత్ర కూడా ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో జీడీసీసీబీకి చెందిన 9 మంది మేనేజర్లు, ఆరుగురు అసిస్టెంట్ మేనేజర్లు, ఓ క్యాషియర్, ఐదుగురు సూపర్‌వైజర్లు, మరికొందరు రెవెన్యూ అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో బాధ్యులైన అధికారులు సివిల్, క్రిమినల్ చర్యలు నిలువరించాలని కోరుతూ చేసిన విజ్ఞప్తిని హైకోర్టు కొట్టివేసింది.



బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రంలో నూతన హంగులతో నిర్మించిన పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్

నాడు టీడీపీ హయాంలో నిర్మాణం

గత ఐదేళ్లు పాడుపెట్టిన వైసీపీ పాలకులు

తుది మెరుగులు.. త్వరలో ప్రారంభోత్సవం

పోస్ట్ హార్వెస్ట్ సెంటర్ సిద్ధం

బాపట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాల పరిధిలో పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్(కోత అనంతరం సాంకేతిక పరిజ్ఞానకేంద్రం) ఆధునిక హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విక్రయించి అధిక లాభాలు ఆర్జించేందుకు శిక్షణ, అవగాహన కల్పించే విధంగా దీనిని నిర్వహిస్తున్నారు. ఎప్పటి నుంచో వ్యవసాయ కళాశాలలో ఉన్న ఈ సెంటర్‌కు సొంత భవనం నిర్మించి రైతులకు శిక్షణ, అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని ప్రారంభించకుండా వైసీపీ పాలకులు ఐదేళ్లు పాడుపెట్టారు. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమం దృష్ట్యా తిరిగి ఆ భవనంపై దృష్టి సారించింది. భవనంలో కావాల్సిన ఏర్పాట్లు చేయించి, రంగులు వేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. వ్యవసాయోత్పత్తులను ప్రాసెసింగ్ చేసే యంత్రాలు పెట్టేందుకు పెద్ద షెడ్ కూడా నిర్మించారు.



యంత్రాలు ఏర్పాటు చేసేందుకు నిర్మించిన కట్టడం

తక్కువ ధరకు శుద్ధి చేస్తాం

పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రాసెసింగ్ చేసే యంత్రాలు ఉన్నాయి. పసుపుకొమ్ములను ఉడకపెట్టేందుకు ఆవిరి యంత్రం, పసుపు గ్రేడర్, పసుపు పాలిషర్, మిరపకాయలు ఆరుదల యంత్రం, ఎండు మిరపను గోతాలలో తొక్కే యంత్రం, చిరుధాన్యాలను ప్రాసెసింగ్ చేసే యంత్రం, అటుకులు, మరమరాలు, చిరుధాన్యాలు పొట్టు తీసే యంత్రం, బద్దలు చేసే యంత్రం ఇక్కడ ఉన్నాయి. వీటి వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ ఇస్తాం. అవసరమైన వారికి తక్కువ ధరకు శుద్ధి చేసి ఇస్తాం.



-డాక్టర్ ఎల్.ఏడుకొండలు, ప్రధాన శాస్త్రవేత్త

ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గుంటూరు జిల్లాలో 4.95 లక్షల మంది ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 5 నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన వారు 2.07 లక్షలు మంది ఉండగా, 15 సంవత్సరాలు పైబడిన వారు 2.88 లక్షల మంది ఉన్నట్లు సమాచారం. 0-6 సంవత్సరాల వయస్సు కలిగిన 9400 మంది పిల్లలకు ఇంతవరకు అసలు ఆధార్ కార్డు లేనట్లు తెలుస్తుంది. వారిలో 6758 మంది పిల్లలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఉండి కూడా ఆధార్ కార్డులు పొందక పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో నూతన ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు, ఉన్నవాటిని అప్‌డేట్ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ తెలిపారు. ప్రస్తుతం ఆరంభమయిన ఆధార్ కేంద్రాల్లో ఈ నెల 22వ తేదీ వరకు మొదటి విడత, 25 నుంచి 28వ తేదీ వరకు రెండో విడత వరకు ప్రజలకు అవసరం అయిన సేవలు అందిస్తారని తెలిపారు. ప్రతి మండలంలో మూడు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్ సేవల కోసం జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాలు పని చేస్తున్నాయని ఆయన తెలిపారు.

మార్చి నెల జీతాలు 28వ తేదీనే జమచేయాలి

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల చివరి లో రంజాన్, ఉగాది వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నందున జీతాలు 28వ తేదీనే జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ 28వ తేదీన జీతాలు జమ చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులంతా సంతోషంగా పండుగ నాచరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉగాది కానుకగా ఉద్యోగులకు రావాల్సిన డీఏ మంజూరు చేయాలని, తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలని, 12వ పే రివిజన్ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దుకాణాల వేలం ద్వారా రూ.54 లక్షల ఆదాయం

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో వివిధ దుకాణాల లీజుకు సంబంధించి గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగిన బహిరంగ వేలంలో రూ. 54.22 లక్షల ఆదాయం లభించింది. గత సంవత్సరం కంటే ఇప్పుడు జరిగిన వేలంలో రూ. 4.78 లక్షల అధిక ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి పి.సునీల్‌కుమార్ తెలిపారు. కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు అమ్ముకునేందుకు రూ.17.20లక్షలు, వాహనాల పార్కింగ్‌కు రూ.10.61లక్షలు, బొమ్మలు అమ్ముకునేందుకు రూ.3.90లక్షలు, నదీతీరంలో కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు రూ.9.09లక్షలు, చెప్పులు భద్రపరుచుకునేందుకు రూ.2.66లక్షలు, తల నీలాలు పోగుచేసుకునేందుకు రూ.20వేలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునేందుకు రూ.9.51లక్షలు, మొదటి ప్రాకారంలో కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు రూ.లక్షా 5 వేలు వేలం పాట ద్వారా ఆదాయం లభించింది. వేలం పాటను పెదకూరపాడు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణరెడ్డి పర్యవేక్షించారు.



వేములూరిపాడులో భూములను పరిశీలిస్తున్న జేసీ భార్గవ్ తేజ

వినుకొండ-గుంటూరు హైవే విస్తరణకు...

భూములను పరిశీలించిన జేసి భార్గవ తేజ

మేడికొండూరు, ఫిరంగిపురం మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వినుకొండ-గుంటూరు జాతీయ రహదారి 554డి నాలుగు లైన్లగా విస్తరించే పనులు ఊపందుకున్నాయి. అందులో భాగంగా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు భూసేకరణ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ తేజ మేడికొండూరు, ఫిరంగిపురం మండ లాలలో రహదారి విస్తరణకు అవసరమైన భూములను గురువారం పరిశీలించారు. మేడికొండూరు మండలంలోని డోకిపర్రు, మంగళగిరిపాడు, మేడికొండూరు, ఫిరంగిపురం మండలంలోని పొనుగుపాడు, మేరికపూడి, నుదురుపాడు, వేమవరం, రేపూడి, ఫిరంగిపురం, అమీనాబాద్ గ్రామాలలోని సర్వే నంబర్లను, భూములను స్వరూపాన్ని ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల పరిధిలో భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో ఆయన మాట్లాడారు. రహదారుల అభివృద్ధి నిమిత్తం భూములు అవసరమవుతున్నందున రైతులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు, ఫిరంగిపురం తహసీల్దార్లు ఎం. హరిబాబు, జే ప్రసాదరావు, సర్వేయర్లు కె. సాంబశివరావు, వెంకటేశ్వర్లు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నెలాఖరు వరకు సాగునీరివ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే యరపతినేని



అసెంబ్లీలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడికాలువ పరిధిలో గుర జాల నియోజకవర్గంలోని అన్ని మేజర్లు, మైనర్ కాల్వలకు వారబందీ పెట్టడం వల్ల నీటి విడుదల నిలిపివేయడం, తగ్గించడంతో మిర్చి పంటలు దెబ్బతింటు న్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం అసెంబ్లీ లో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్క కాలువ కూడా బాగు చేయకపోవడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన తాను తమ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన రెండు నెలల్లో నియోజకవర్గపరిధిలోని అన్ని మేజర్లు, మైనర్ కాల్వలను బాగు చేయించామని యరపతినేని తెలిపారు. నీటి విడుదల తగ్గించ డం, నిలిపివేయడం వల్ల చివరి భూముల్లో సాగుచేస్తున్న మిర్చి, వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. వేసవి కాలం వచ్చినందున గ్రామ, పట్టణ పరిధిలోని చెరువులు, కుంటలను నీటితో నింపి వేసవిలో తాగు నీరు ఎద్దడి లేకుండా గ్రామ, పట్టణ స్థాయి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు ఏప్రిల్ నెలాఖరు వరకు సాగర్‌నీరు నిరాటంకంగా విడుదల చేయాలని కోరారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో..

మహిళా ఉద్యోగి హత్య

పిడుగురాళ్ల మార్చి 20 (ఆంధ్రజ్యోతి). డబ్బులు విషయంలో మాటా మాటా పెరిగి మహిళా ఉద్యోగిపై చేయి చేసుకోవడంతో తల బలంగా గోడకు తగిలి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లిలో జరిగింది. పిడుగురాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లాకు చెందిన సీతారత్నం(57) ఏఎన్‌ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై మాచవరం పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చింది. అదే పీహెచ్‌సీలో సత్తెనపల్లికి చెందిన ఎం శ్రీనివాసరావు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం వుంది. ఈ నేపథ్యంలో బ్రాహ్మణపల్లిలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్న సీతారత్నం ఇంటికి శ్రీనివాసరావు వచ్చి వెళుతూ వుండేవాడు. గురువారం రాత్రి డబ్బులు విషయంలోనే, మరో విషయంలోనూ ఇద్దరి మధ్య మాట పెరిగి వాగ్వాదం జరిగింది. ఆ కోపంలో శ్రీనివాసరావు, సీతారత్నాన్ని బలంగా గోడకేసి కొట్టడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. చుట్టుపక్కల వారు ఘటనాస్థలానికి చేరుకుని శ్రీనివాసరావును గదిలో పెట్టి బంధించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మోహన్ పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 519.00 అడుగులు ఉంది. ఇది 147.45 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7190 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,023 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎత్తిపోతల పథకాలను తక్షణమే పునరుద్ధరించండి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అసెంబ్లీలో కోరారు. ఆ కాల్వపై 200 లకు పైగా ఎత్తిపోతల పథకాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయకట్టు స్థిరీకరణ, కాల్వల ఆధునీకరణ అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన సాగు, తాగునీటి సమస్యలపై ప్రభుత్వ వివరణ అడిగారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా రూ.6 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన హరిశ్చంద్రాపురం, నకరికల్లు ప్రాజెక్ట్ కి టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్ల ను కూడా ఎంపిక చేసిందని అన్నారు. ఆ ప్రాజెక్ట్ లో గత ప్రభుత్వం రూపాయి పనిచేయలేదని, ఆప్రాజెక్ట్ ను ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పాలని పుల్లారావు సభాముఖంగా ప్రశ్నించారు. హరిశ్చంద్రాపురం-నకరికల్లు ప్రాజెక్ట్ ను బనకచర్లలో విలీనం చేసే ఆలోచన ఉందా అని కూడా ప్రశ్నించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీ.సందీప్, వై.సుజిత్‌కుమార్

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

తాడికొండ(లాం)మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవడం వలన ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చునని పీపుల్ సొల్యూషన్స్, కాన్సంట్రిక్స్ క్యాటలిస్ట్ సీనియర్ మేనేజర్ డీ.సందీప్ తెలిపారు. లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న చలపతి మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందీప్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఉండే మెళుకువలు నేర్చుకోవడం వలన ఉన్నత స్థాయికి వెళ్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన టెక్నికల్ ఈవెంట్స్‌లో 16 కళాశాలల నుంచి 67 బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. అమరావతి విట్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి, కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. పేపర్ ప్రెజెంటేషన్‌లో ఒంగోలు క్విస్ కళాశాలకు చెందిన టీ.శిరీష ప్రథమ బహుమతి, అర్జేయుకేటీకి చెందిన పీ.చైతన్య ద్వితీయ బహుమతి పొందారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో అర్జేయుకేటీకి చెందిన పీ.చైతన్య ప్రథమ, క్విస్ కళాశాలకు చెందిన ఎస్.కే. షమీ ద్వితీయ స్థానం పొందారు. ప్రాజెక్ట్ ఎక్స్ షోలో చలపతి కళాశాల విద్యార్థి కే.రూపేష్ ప్రథమ, క్విస్ కాలేజీ విద్యార్థి గోవిందరాజు ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. టెక్నికల్ క్విజ్‌లో చలపతి కళాశాలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి. కోడింగ్ చాలెంజ్‌లో చలపతి కళాశాలకు చెందిన జ్యోతి మణికంఠ, కే. తసీంలు ప్రథమ, దిత్వీయ స్థానాలు సాధించారు. లోగో డిజైన్‌లో చలపతి కళాశాల విద్యార్థి ఎల్ అనిత ప్రథమ, విజయవాడ ఎన్నారై కళాశాల విద్యార్థి సాయి యోగేష్ ద్వితీయ బహుమతి సాధించారు. సర్క్యూట్ డి బగ్గింగ్ అండ్ ఫజిల్‌లో విజ్ఞాన లారా కళాశాల విద్యార్థి కే. యామిని, చలపతి కళాశాల విద్యార్థి తిరుమలరావుకు బహుమతులు లభించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వై.వీ.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

1.5 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

అమరావతి, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): అమరావతిలోని ఆరుడొంకల బావి సమీపంలోని పాత కోళ్లఫారం షెడ్‌లో 1.5 కేజీల గంజాయిని సత్తెనపల్లి డీఎస్‌పీ స్పెషల్ టీం గురువారం స్వాధీనం చేసుకున్నారు. అమరావతిలో గంజాయి వ్యాపారం జోరుగా సాగుతుందన్న సమాచారంతో తనిఖీలు చేస్తున్న టీంకు షెడ్‌లో నలుగురు అనుమానాస్పదంగా గంజాయి పొట్లాలు కట్టడం గమనించి వారి వద్దకు వెళ్లే లోపు నలుగురు నిందితులు పరారయ్యారు. ఆ ప్రదేశంలో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు వదిలి వెళ్లిన బైక్‌ను గుర్తించి దాని ద్వారా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07230 చర్లపల్లి - కన్యాకుమారి ప్రత్యేక రైలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 25వ తేదీ వరకు ప్రతీ బుధవారం రాత్రి 9.50కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి మీదగా అర్థరాత్రి దాటాక 2.30కి గుంటూరు, రేణిగుంట, తిరువణ్ణామలై, చిదంబరం, కుంభకోణం, తంజావూరు, కొడైకెనాల్ రోడ్డు, మధురై మీదగా గురువారం అర్థరాత్రి దాటాక శుక్రవారం ప్రారంభ సమయం(వేకువజామున ముందు) 2.30 గంటలకు కన్యాకుమారి చేరుకొంటుంది. నంబరు. 07229 కన్యాకుమారి - చర్లపల్లి ప్రత్యేక రైలు ఏప్రిల్ 4వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం వేకువజామున 5.15 గంటలకు బయలుదేరి శనివారం వేకువజామున 4.50కి గుంటూరు, 5.44కి సత్తెనపల్లి, ఉదయం 6.04కి నడికుడి, ఉదయం 11.40కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో బీసీ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు డీఎస్సీకి ఆన్ లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎ భవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు టెట్ పాస్ అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పదవ తరగతి, బీ ఈడీ లేదా టీసీసీ మార్కుల జాబితా, టెట్ మార్కుల జాబితా, కుల, ఆదాయ, ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో రాజా గారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్లో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థుల తల్లిదండ్రులు ఆదాయం రూ. లక్ష లోపు ఉండాలని సూచించారు. ఇతర వివరాలు కోసం 0863-2358071 లో సంప్రదించాలని సూచించారు.

వైసీపీ నేత అరెస్టు

ఈపూరు, మార్చి20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ మాట్లాడినందుకు మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామ వైసీపీ నాయకుడు కొండవర్రు నాగేశ్వరరావును గురువారం పోలీసులు అరెస్టు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు బాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు నాగేశ్వరరావును అరెస్టు చేసి విచారించి స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	109, 117, 128
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

న్యాయవాదుల క్రికెట్ టోర్నీ విజేత గుంటూరు జట్టు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఒకటవ అదనపు జిల్లా జడ్జి సత్యవతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్‌బాబు

గుంటూరు(లీగల్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో గుంటూరు చంద్రశేఖర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు గురువారం సాయంత్రం ఒకటవ అదనపు జిల్లా జడ్జి వి ఏ ఎల్ సత్యవతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్ బాబులు ట్రోఫీలను అందజేశారు. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు న్యాయవాదుల జట్టుతో నరసరావుపేట న్యాయవాదుల జట్టు తలపడింది. తొలుత టాస్ గెలిచిన నరసరావుపేట జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు న్యాయవాదుల జట్టుకు ఓపెనర్లు అంచుల రామాంజనేయులు (47 బంతుల్లో 59 పరుగులు) మహమ్మద్ మాజ్ (27 బంతుల్లో 48 పరుగులు) తమ నిలకడైన బ్యాటింగ్‌తో మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన జట్టు కెప్టెన్ చంద్ర శేఖర్ రెడ్డి (26 బంతుల్లో 65 పరుగులు) సాజిద్ (20 బంతుల్లో 30పరుగులు) మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో గుంటూరు న్యాయవాదుల జట్టు 20 ఓవర్లలో మూడు వికెట్లకు 221 పరుగులు చేసింది. నరసరావుపేట జట్టులోని ఖాదర్, కిరణ్, సూర్యలకు ఒక్కో వికెట్ లభించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నరసరావుపేట జట్టు 17.3 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌట్ అయింది. సాజిద్ 3.3 ఓవర్లు బౌలింగ్ చేసి ఐదు వికెట్లు కూల్చాడు. నరసరావుపేట జట్టులో అధికంగా యశ్వంత్ 20 పరుగులు రవి 44 పరుగులు సంజీవ్ 17 పరుగులు మధు 32 పరుగులు చేశారు. బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసి బ్యాటింగ్‌లో 30 పరుగులు సాధించిన గుంటూరు న్యాయవాదుల జట్టు ప్లేయర్ సాజిద్‌కు మ్యాన్ అఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

పరీక్షల కోసం రోగి.. విశ్రాంతిలో ఉద్యోగి



వైద్యపరీక్షలకోసం రేడియాలజీ విభాగం వద్ద ఎదురు చూస్తున్న రోగి



మరమ్మతులకు గురైన సిటీస్కాన్ పరికరంపై నిద్రిస్తున్న ఉద్యోగి

తెనాలి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో అత్యవసర విభాగానికి 24 గంటలు వైద్యసేవలకు రోగులు వస్తుంటారు. వారిని వైద్యులు పరీక్షలు చేసి రోగనిర్ధారణకు అవసరమైన స్కానింగ్‌లు, రక్త పరీక్షలు వంటివాటికి పంపుతుంటారు. ఆ రిపోర్టుల ఆధారంగా వైద్యం అందించాల్సి ఉంటుంది. దీంతో రోగుల సహాయకులు వైద్యుల సూచనల మేరకు పరీక్షలు చేయించుకునేందుకు రేడియాలజీ విభాగానికి వస్తుంటారు. అత్యవసర విభాగం నుంచి వచ్చే రోగులకు 24 గంటలు అవసరమైన పరీక్షలు జరిపేలా సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. గురువారం వైద్యశాల్లో ఊపిరాడక ఇబ్బందులు పడుతూ వచ్చిన ఓ రోగికి రేడియాలజీ విభాగంలో పరీక్షలు, అనంతరం రక్తపరీక్షలు చేయించుకురావాలని వైద్యులు సూచించారు. ఆయా విభాగాల్లో రేడియాలజీ విభాగానికి పరీక్షలకు వెళితే సిబ్బంది వైద్యసిబ్బంది కనిపించలేదు. అత్యవసర వైద్యం కావడంతో వారి కోసం రోగి బంధువులు పలువురిని వాకబు చేశారు. ఈ క్రమంలో భోజనానికి వెళ్లారని చెప్పడంతో వారి కోసం పడిగాపులు తప్పలేదు. ఇదే క్రమంలో పక్కనే ఉన్న సిటీస్కానర్ గదిలో ఏసీ ఆన్ చేసుకుని ఆ విభాగానికి చెందిన ఓ ఉద్యోగి నిద్రపోవడం చూసి రోగిబంధువులు విస్మయానికి గురయ్యారు.

సాంకేతికతతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

పెదకాకాని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతికతను జోడించి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనలు సమాజానికి ప్రయోజనకరంగా మారాలని తెలిపారు. నూతన విద్యా విధానం వల్ల విద్యా రంగంలో సంస్కరణలు రావడంతో పాటు, కొన్ని సవాళ్లు కూడా ఎదురుకోవాల్సి వస్తుందని చెప్పారు. దేశంలోకి ప్రైవేట్ యూనివర్సిటీల రాకతో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో పరిశోధన ఇతర అంశాలను పటిష్ట పరచి విద్యార్థులను ఆకర్షించే విధంగా అడుగులు వేయాలని సూచించారు.

వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర రోజురోజుకూ పెరుగుతుందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు, పరిశోధకులు దృష్టి సారిస్తేనే ఉత్తమ ఫలితాలను పొందవచ్చన్నారు. వర్సిటీ రెక్టర్ ఆచార్య కే. రత్నషీలామణి, వర్సిటీ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, జాతీయ సదస్సు డైరెక్టర్ ఆచార్య చేబ్రోలు లింగరాజు తదితరులు ప్రసంగించారు.



సదస్సులో ప్రసంగిస్తున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు.

1,48,601 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,42,015 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,48,601 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 60,317 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11000	12500
334	9500	13500	బంగారం	---	---
నంబరు. 5	10000	13500	బ్యాడిగి 355	10000	13500
273	---	----	సింజెంటా		
341	10500	14500	బ్యాడిగి 5531	10000	11700
4884	10000	12000	దేవనూరు డీలక్స్	11000	13300
సూపర్ 10	--	--	ఆర్మూరు	10000	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10500	14000	తాలుకాయలు	5000	7500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

గేట్ ఎంట్రన్స్‌లో సాయిసిరికి ఆల్ ఇండియా 309 ర్యాంకు



వేమూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా వేమూరు మండలం కుచ్చెళ్ళపాడు గ్రామానికి చెందిన విద్యార్థిని తాడి కొండ సాయిసిరి గేట్ ఎంట్రన్స్‌లో ఆల్ ఇండియా 309ర్యాంక్ సాధించింది. రైతు కుటుంబంలో జన్మించిన సాయిసిరి పదో తరగతి వరకు తెనాలి నారాయణ కళాశాలలో చదివి ఇంటర్ విజయవాడ చైతన్య కళాశాలలో పూర్తిచేసింది. అనంతరం పంజాబ్ రాష్ట్రంలోని లవ్‌లీ ప్రొఫెషన్ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసి అక్కడే గేట్ ఎంట్రన్స్‌కు శిక్షణ పొందింది. జాతీయస్థాయిలో 309ర్యాంకు సాధించింది.

మంచినీటి పథకానికి రూ.97.30లక్షలు మంజూరు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబు

భట్టిప్రోలు(కొల్లూరు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): రక్షిత మంచినీటి పథకానికి రూ.97.30లక్షల నిధులు మంజూరైనట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భట్టిప్రోలు గ్రామాల్లో మంచినీటి సరఫరా పథకం అభివృద్ధికి అవసరమైన పనులు చేయడానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సిఫార్సులతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అవసరమైన చోట్ల బోర్లు, పంపు హౌస్‌లు, పైపులైను పనులకు ఈ నిధులు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఆయా పనులకు టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ వాగ్దానం.. నిలబెట్టుకున్న చంద్రబాబు

● కృతజ్ఞతలు తెలిపిన చేనేత నాయకులు

రేపల్లె, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వాగ్దానం, నారా లోకేశ్ పాదయాత్రలో నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తామన్న వాగ్దానం నిలబెట్టుకున్నారని టీడీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదినెలల్లోనే నేతన్నలకు 200యూనిట్ల విద్యుత్ ఇవ్వటానికి క్యాబినెట్ ఆమోదం తెలపటంపై ఆయన చేనేత కార్మికులు తరఫున కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీసీ నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, తాడిపర్తి మల్లికార్జునరావు, ఉమామహేశ్వరరావు, బొర్రా సూర్యరాజు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● సీడీపీవో విజయలక్ష్మీ

కొల్లూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు అంగన్‌వాడీకేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో విజయలక్ష్మీ అన్నారు. గురువారం కొల్లూరులోని 8,10,11 కేంద్రాల్లో సీడీపీవో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులతో సమావేశమై అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే సేవలను వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ విజయలక్ష్మీ, అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంచేలా విద్యాబోధన చెయ్యాలి

చెరుకుపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి కొత్తపేటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కవిత మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పిల్లల్లో నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. పిల్లల్లో నైపుణ్యం పెంచేలా విద్యాబోధన చెయ్యాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభచూపిన వారికి బహుమతులు ఇచ్చారు. కార్యక్రమానికి గండే సాంబశివరావు, కె.రంగారావు, కాటూరి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లో కూలీలకు పనులు కల్పించాలి

● వైసీపీ వేమూరు ఇన్‌చార్జి అశోక్‌బాబు

కొల్లూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్ తెరిపించి కూలీలకు పనులు కల్పించాలని వేమూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. గురువారం కొల్లూరులోని రెవెన్యూ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి ఆయన తహసీల్దార్ వెంకటేశ్వర్లుతో బేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జువ్వలపాలెం పరిధిలో ఉన్న ఇసుక రీచ్‌పై ఆధారపడి ఎంతోమంది పేద, దళితులు ఉపాధి పొందుతున్నారని, నెల రోజుల క్రితం రెవెన్యూ, పోలీసు అధికారులు నదిలోకి వెళ్ళే మార్గాలకు గండ్లు కొట్టించి ఇసుక త్రవ్వకాలు చేయరాదంటూ హుకుం జారీ చేశారన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక అవసరాల నిమిత్తం కూలీలు ఇసుక తవ్వుకునేందుకు ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చినట్లు తహసీల్దార్ వైసీపీ నాయకులకు చెప్పడంతో వారు వెనుదిరిగారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం హర్షణీయం

భట్టిప్రోలు(కొల్లూరు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకం అమలుచేస్తూ ఆమోదించడం హర్షణీయమని చేనేత కార్మికసంఘ రాష్ట్ర సహాయకార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ అన్నారు. గురువారం స్థానిక చేనేత సంఘ కార్మిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి నాయకుల ఎన్నికల హామీ మేరకు ఉచిత విద్యుత్‌కు ఆమోదం తెలిపారన్నారు. చేనేత కార్మికులు తమ వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. సమావేశంలో కార్మికసంఘ రాష్ట్ర సమితి సభ్యులు కె.రామకోటేశ్వరరావు, చేనేతనాయకులు వీరమోహన్‌రావు, పార్థసారధి, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

నిర్వహణలో నిర్లక్ష్యం

● అపరిశుభ్రంగా జంతువధశాల ● పట్టించుకోని అధికారులు



బాపట్లలోని మూడో వార్డులో జంతువధశాల పక్కనే ప్రహరీ తొలిగించి తలుపులు తీసివేసి ఉన్న దృశ్యం

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జంతువధశాల అపరిశుభ్రంగా మారింది. జంతువులు వధించేవారు వ్యర్థాలు మొత్తం ఇక్కడే పడేసి వెళతున్నారు. చుట్టూ ముళ్ళచెట్లు పెరిగిపోయాయి. ఓవైపు రోడ్డు నిర్మాణం కోసం గేటు తొలిగించి తిరిగి ఏర్పాటు చేయలేదు. నిత్యం తలుపులు తీసే ఉంటాయి. దీనివల్ల అనేకమంది ఆకతాయిలకు అడ్డాగా మారింది. మద్యం సేవించటం, బాటిల్స్ అక్కడే పడేయటం పరిపాటిగా మారింది. అపరిశుభ్రమైనపరిసరాలతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతున్నది. 2010లో దీన్ని నిర్మించారు. ప్రతి సంవత్సరం దీనిని బహిరంగవేలం ద్వారా ఓ వ్యక్తి పాడుకొని జంతువులను కోసేవారి దగ్గర ఆశీలు వసూలు చేసుకుంటారు. సదరు కాంట్రాక్టర్ ఆశీలును వసూలు చేసుకునేందుకు చూపించే శ్రద్ధ దీనిని శుభ్రం చేయటంలో చూపటంలేదు. కోసిన జంతువుల వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేయటం వల్ల ఈప్రాంతం దుర్గంధపూరితంగా మారింది. మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న జంతు వధశాల

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

● అధికారులకు కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఈ విషయమై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూపొందించాల్సిన ప్రగతి నివేదికలపై సూచనలు చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగాలు అభివృద్ధి చెందే దిశగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. తీర ప్రాంత పర్యాటక రంగ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. మత్స్య, ఆక్వా పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు చేయాలన్నారు. కృష్ణానది కరకట్ట అభివృద్ధికి, కృష్ణాపశ్చిమడెల్టా కాల్వల మరమ్మతులకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, ముఖ్యప్రణాళికాధికారి శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్‌ఈ అనంతరాజు, గృహనిర్మాణశాఖ పీడీ వై.వెంకటేశ్వరరావు, డ్వామాపీడీ జయలక్ష్మీ, అటవీ, మత్స్యశాఖాధికారులు భీమయ్య, కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వడగాల్పుల ముందస్తు చర్యలపై అవగాహన కల్పించాలి

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాల్పుల ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి మండల కేంద్రం, పట్టణ ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలన్నారు. బస్టాండ్, పబ్లిక్ ప్రాంతాలలో నీడ ఉండేలా పందిరి వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉపాధిహామీ పనులు జరిగే ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, ఫ్లూయిడ్స్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వడదెబ్బ తగిలినవారికి తక్షణమే వైద్యం అందించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

● ఎన్నికల అధికారి, జడ్పీ సీఈవో జ్యోతిబసు



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, జడ్పీ సీఈవో జ్యోతిబసు

వేమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జడ్పీ సీఈవో, నియోజకవర్గ ఎన్నికల అధికారి జ్యోతిబస్సు హెచ్చరించారు. తహశీల్దార్ సుశీల అధ్యక్షతన గురువారం స్థానికంగా నియోజకవర్గ స్థాయి బీఎల్‌ఓల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 2026లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పంచనామా సక్రమంగా లేకుండా ఓటర్లను తొలగిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఓటరు కార్డుకు ఆధార్ నెంబర్ లింక్ చేయడంతోపాటు వారి ఫోన్ నెంబరు కూడా జతపరచాలన్నారు. డబుల్ ఎంట్రీ కనపడకూడదన్నారు. బీఎల్‌వోలు తమ పరిధికి సంబంధించిన రికార్డులను భద్రంగా పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, చుండూరు తహసీల్దార్ నాగరాజారావు, ఎంపీడీవో శివన్నారాయణ, ఆర్ఐ సాయి, కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు డీటీలు, ఎంఈవో వెంకటేశ్వర్లు, ట్రైనర్ సాధిక్ మాట్లాడారు. 89 గ్రామాలకు చెందిన బీఎల్‌వోలు హాజరయ్యారు.



బుక్‌లెట్స్ ఆవిష్కరిస్తున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ కె.శివకృష్ణ, వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హోటల్ గౌతమ్‌లో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిజర్వు బ్యాంక్, అవార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎవేర్నెస్ ఫండ్ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి లీడ్‌బ్యాంక్ మేనేజర్ కె.శివకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఖాతాదారులందరు తప్పనిసరిగా నామినేషన్ చేయించుకోవాలని బ్యాంక్‌ఖాతాను సక్రమంగా వాడాలని చెప్పారు. లోన్ సక్రమంగా సకాలంలో చెల్లించి వడ్డీరాయితీ పొందాలన్నారు. కార్యక్రమంలో ఆయా బ్యాంక్ మేనేజర్లు టి.కమలాకరరావు, జె.శ్యామ్‌కుమార్, డి.వెంకటేశ్వర్లు, టి.రాఘవేంద్ర, ఏవీ నాయక్, మెప్మా సీఎం నర్రా సుబ్రహ్మణ్యం, జానకిరావు, డాక్టర్ కె.సృజన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దార్శనికతకు గేట్స్ ఫౌండేషన్ ఒప్పందమే నిదర్శనం

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిలిగేట్స్‌తో ఒప్పందం కుదుర్చుకోవటం ఆయన దార్శనికతకు నిదర్శనమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దేశంలోనే ముందుగా వైద్యం, ఆరోగ్యం, మెడ్‌టెక్, విద్య, వ్యవసాయ రంగాలలో ఎదురౌతున్న సమస్యలను తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునే సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి సాధించేందుకు సీఎం గేట్స్ ఫౌండేషన్ సేవలు పొందే ఒప్పందం కుదుర్చుకోవటం హర్షణీయమన్నారు.

నకిలీ లేబర్ ఆఫీసర్‌లంటూ ప్రచారం

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలో నకిలీ లేబర్ ఆఫీసర్‌లు హల్‌చల్ చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో గురువారం విస్తృత ప్రచారం జరిగింది. కొంతమంది వ్యాపారులకు ఫోన్‌లు చేసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఈ విషయమై బాపట్ల లేబర్ ఆఫీసర్ వి.సాయిజ్యోతి మాట్లాడుతూ ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు జరిగితే తగిన సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అపార్‌పై ప్రధానోపాధ్యాయులకు అవగాహన

పిట్టలవానిపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం, మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అపార్‌పై తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల టీసీలకు ఆధార్ తప్పనిసరిగా అనుసంధానం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, విద్యాశాఖాధికారి-2 కె.రాజారత్నం పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన కోసం రూ.లక్ష వరకు రాయితీ

● బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన కోసం రూ.లక్ష వరకు రాయితీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం బీసీ కుల వృత్తిదారుల ఆదరణ పథకం ఫేస్-3 రాయితీ రుణాల మంజూరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అర్హులైన వారు రుణం మొత్తంలో 10శాతం ముందుగా డీడీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. 10శాతం చెల్లించినవారికి మిగిలిన 90శాతం ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని జతచేసి ఆయా కులవృత్తిదారులకు రుణసదుపాయాన్ని కల్పిస్తారన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేశన శంకరరావు మాట్లాడుతూ కులవృత్తిదారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీసీల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించినట్లు అగ్నికుల క్షత్రియుల కార్పొరేషన్ డైరెక్టర్‌లు ముమ్మిడి రామకృష్ణ, వి.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వెంకటేశ్వర్లు, చేజర్ల సతీష్, శ్రీనివాసరాజు, మారం రవికుమార్, జొన్నాజుల వెంకటేశ్వర్లు, పిన్నిబోయన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు పాటించాలి

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైతిక విలువలు పాటిస్తూ తమ పూర్తి శక్తి సామర్థ్యాలను కేరీర్ ఉన్నతికి వెచ్చించాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు కోరారు. బాపట్ల ఫార్మసీ కళాశాలలో గురువారం హాస్టల్‌డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ముప్పలనేని ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగంచేసుకొని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు బానిసలు కావద్దన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మూర్తి, డాక్టర్ వి.సాయికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీ మెట్ల మార్గంలో సీసీ కెమెరాల ఏర్పాటు



బాపట్లలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ మెట్లపై సీసీకెమెరాలు పరిశీలిస్తున్న పట్టణ సీఐ ఆర్.రాంబాబు, సిబ్బంది

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బాపట్లలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ పైకి వెళ్ళే మెట్ల మార్గంలో కొంతకాలంగా మందుబాబులు హల్‌చల్ చేయటంతోపాటు ఇటీవల మత్తు ఇంజక్షన్‌లు చేసుకుంటున్న యువత పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో పట్టణ సీఐ ఆర్.రాంబాబు ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టారు. గురువారం రైల్వేట్రాక్ ఇరువైపుల ఉన్న మెట్లమార్గాలు కనిపించేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీకెమెరాల పనితీరును సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

● ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కర్లపాలెం పరిధిలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సునీత, సిబ్బంది భ్రమరాంబ ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తుండగా ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం కట్టాలి

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం కట్టాలని పట్టణ బీజేపీ అధ్యక్షుడు బ్రహ్మండం బాలనారాయణ కోరారు. ఏరియావైద్యశాల ఆవరణలో గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మామిడి రమేష్‌కుమార్, బి.బాబునాగేంద్ర, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, తిలక్, కామరాజుగడ్డ శ్రీనివాస్, నటరాజన్, నాళం నరేష్, నరాలశెట్టి శ్రీనివాస్, వల్లూరి భావన్నారాయణ, తురకా గోపి, రత్తయ్య, సత్యప్రతాప్, కొండారెడ్డి అనీల్‌కుమార్, గుండ్రెడ్డి శ్రీహరి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి ఈబీ విలియమ్స్

కార్డుహోల్డర్లు ఈకేవైసీ చేయించుకోవాలి

● జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి విలియమ్స్

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా బయోమెట్రిక్‌తో ఈకేవైసీని వెంటనే చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి విలియమ్స్ తెలిపారు. ఈ విషయమై గురువారం బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అన్ని మండలాల రేషన్‌డీలర్ల ప్రెసిడెంట్‌లు, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోనివారికి రైస్‌కార్డుద్వారా వచ్చే సదుపాయాలు ఆగిపోతాయన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ డీటీలు ఫణికుమార్, ఓంకార్, గీత, సీఎస్ఆర్‌ఐలు పాల్గొన్నారు.

నాటుసారాకు ఉపయోగించే బెల్లం విక్రయించరాదు

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, జిల్లా అధికారి జి.దేవదత్తు, ఇతర అధికారులు, బెల్లం వ్యాపారులు

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం అమ్మకాలు చేయవద్దని ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తెలిపారు. బాపట్ల జిల్లా అధికారి కార్యాలయంలో గురువారం బెల్లం వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ నాటుసారా తయారీ అనుమానితుల వివరాలు తెలపాలన్నారు. అనంతరం బెల్లం వ్యాపారులతో కలిసి నవోదయం 2.0లో భాగంగా నాటుసారా వ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి జి.దేవదత్తు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.వెంకటేశ్వర్లు, సీఐ పి.గీతిక, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నాటుసారా నిర్మూలనకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా రాజానాయక్



కలెక్టర్ వెంకటమురళికి మొక్క అందజేస్తున్న ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.రాజానాయక్

బాపట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఆర్.రాజానాయక్ గురువారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ ద్వారా చేపట్టే పనుల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

● అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి

బాపట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 11 తరగతులలో ప్రవేశాల కోసం 7,8,9,10,12 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపవుట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిగణించబడతాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్‌ల ద్వారా సమాచారం అందుతుందన్నారు. సంబంధిత పాఠశాల నోటీస్ బోర్డులో వివరాలు నేరుగా చూడవచ్చన్నారు. సందేహాలు ఉంటే 70751 59996, 70750 39990లో సంప్రదించాలని కోరారు.

చదలవాడలో పట్టపగలు చోరీ

● పది సవర్ల బంగారం అపహరణ

వేమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేమూరు మండలం చదలవాడ గ్రామంలో పట్టపగలు చోరీ జరిగింది. ఎస్సై రవికృష్ణ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు చందు వెంకట సుబ్బయ్య దంపతులు బుధవారం ఉదయం ఇంటి తాళాలు వేసుకుని పొలం పనికి వెళ్ళారు. సాయంత్రం 6గంటలకు వచ్చేసరికి తలుపులతో పాటు గదిలోని బీరువా తెరిచి ఉండడానికి చూసి దొంగలు పడ్డారన్న విషయాన్ని గుర్తించారు. బీరువాలో పరిశీలించగా 10సవర్ల బంగారు ఆభరణాలను అపహరించినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని వేమూరు పోలీస్‌స్టేషన్‌కు తెలిపారు. గురువారం క్లూస్ టీం వేలిముద్రలను పరిశీలించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రైతులు వ్యక్తిగత భద్రతా వస్త్రాలు ధరించాలి

● అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి

బాపట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటపొలాలలో పురుగుమందులను పిచికారి చేసేటప్పుడు తప్పనిసరిగా వ్యక్తిగత భద్రతా వస్త్రాలను ధరించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి తెలిపారు. పురుగుమందుల వినియోగంపై కళాశాలలో రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేట్ డీన్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కళాశాల కీటకశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎస్.ఆర్.కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుశీల, డాక్టర్ బి.రత్నకుమారిలు రైతులకు సూచనలు చేశారు. శిక్షణలో సూదివారిపాలెం, కొణికి, హనుమాన్‌పాలెం, పూనపూడి, ఇడుపులపాడు, అంబటివారిపాలెం, ఇంకొల్లు గ్రామాల రైతులు పాల్గొన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పురుగుమందులు పిచికారి ప్రదర్శించి చూపించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి

ఏమంటివి.. ఏమంటివి

ఏకపాత్రాభినయంలో అబ్బురపరిచిన రఘురామ
దుర్యోధనుడి అభినయంతో ప్రథమ బహుమతి
చీఫ్ విప్ జీవీ జట్టు స్కిట్ 'ఇదీ సంగతి'కి ప్రథమ స్థానం
ముగిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల క్రీడా, సాంస్కృతిక పోటీలు

విజయవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య దేవా.. ఏమంటివి.. ఏమంటివి.. అంటూ దానవీరశూరకర్ణ చిత్రంలో దుర్యోధనుడు పాత్రధారి చెప్పిన డైలాగుతో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం అబ్బురపరిచింది. రెండు రోజులుగా విజయవాడలో జరుగుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల క్రీడా, సాంస్కృతిక పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజయవాడ ఏ-కన్వెన్షన్‌లో తొలుత సాంస్కృతిక పోటీలు నిర్వహించి అనంతరం విజేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు బహుమతులు అందజేశారు. ఏకపాత్రాభినయంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రథమ బహుమతి అందుకున్నారు. పల్నాటి బాలచంద్రుడి వేషం ధరించిన మంత్రి కందుల దుర్గేశ్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. స్కిట్లలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బృందం ప్రదర్శించిన 'ఇదీ సంగతి' ప్రథమ బహుమతిని, ఈశ్వరరావు, విజయ్‌కుమార్ ప్రదర్శించిన 'అసందర్భపు పాట' ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి.


క్రికెట్లో మొదటి బహుమతి సాధించిన జట్టు కెప్టెన్ మంత్రి మనోహర్‌కు బహుమతి అందజేస్తున్న చంద్రబాబు, పవన్


పరుగు పందెంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

బ్యాడ్మింటన్: పురుషుల సింగిల్స్ విభాగంలో మంత్రి టీజీ భరత్ ప్రథమ బహుమతి, జయనాగేశ్వరెడ్డికి ద్వితీ యం. డబుల్స్ విన్నర్లుగా మంత్రి సత్యకుమార్- జయనాగేశ్వరెడ్డి. భరత్-పీవీ పార్థసారథి రన్నర్స్‌గా మహిళల సింగిల్స్ విజేత పి.సింధూరరెడ్డి. భూమా అఖిల ప్రియకి ద్వితీయం, డబుల్స్ విన్నర్లుగా అఖిలప్రియ-సింధూరరెడ్డి, రన్నర్లుగా మంత్రి సవిత-శ్రావణిశ్రీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో మంత్రులు టీజీ భరత్-సవితకు ప్రథమం. అఖిలప్రియ, జయనాగేశ్వరెడ్డికి ద్వితీయం. బ్యాడ్మింటన్ 60 ఏళ్ల పైబడిన విభాగంలో అరవింద్‌బాబు విన్నర్.. శివరామిరెడ్డి రన్నర్. 55 ఏళ్ల పైబడిన విభాగంలో గద్దె రామ్మోహన్ ఫస్ట్. రవీంద్రబాబు ద్వితీయం.

పరుగుపందెం: 100 మీటర్ల పరుగు పందెం 50 ఏళ్లలోపు విభాగంలో అరవ శ్రీధర్ ప్రథమ, విజయచందర్ ద్వితీయ, కాకర్ల సురేశ్ తృతీయ బహుమతి. 60 ఏళ్లలోపు విభాగంలో కేఈ శ్యామ్‌కుమార్, సత్యకుమార్, పీవీ పార్థసారథికు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు. 60 ఏళ్ల పైబడిన విభాగంలో బి.రామాంజనేయులికి ప్రథమం, గద్దె రామ్మోహన్ ద్వితీయం. గోరంట్ల బుచ్చయ్యచౌదరికి తృతీయం.

100 కిలోల లోపు బరువు: కె.శ్రీకాంత్, విజయ్‌కుమార్, బొజ్జల సుధీర్‌రెడ్డికి మొదటి మూడు బహుమతులు. మహిళల విభాగంలో ప్రథమ బహుమతిని పి.సింధూరరెడ్డి, ద్వితీయ బహుమతిని రెడ్డప్పగారి మాధవి, తృతీయ బహుమతిని వంగలపూడి అనిత గెలుచుకున్నారు.

షాట్‌పుట్: పురుషుల 60 ఏళ్లలోపు విభాగంలో బి.విజయచందర్, ఆదిరెడ్డి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మొదటి, రెండు, మూడో స్థానాలు. 60 ఏళ్ల పైబడిన విభాగంలో కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, ఎంఎం కొండయ్యయాదవ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు.

మ్యూజికల్ చైర్స్: మొదటి స్థానాన్ని మిరియాల శిరీషాదేవి, ద్వితీయ స్థానాన్ని సవిత, మూడో స్థానాన్ని పి.సింధూరరెడ్డి గెలుచుకున్నారు.

టెన్నిస్: పురుషులు సింగిల్స్‌లో నాదెండ్ల మనోహర్ విన్నర్, పీవీ పార్థసారథి రన్నర్

టేబుల్ టెన్నిస్: పురుషుల విభాగంలో వర్ల కుమార్‌రాజా విన్నర్, కేఈ శ్యామ్‌కుమార్ రన్నర్.

క్యారమ్స్: పురుషులు విభాగంలో గద్దె రామ్మోహన్ ఫస్ట్. వంకా రవీంద్రనాథ్‌కు ద్వితీయం. మహిళల విభాగంలో కర్రి పద్మశ్రీ ప్రథమ, గౌరు చరితారెడ్డి ద్వితీయ, రెడ్డప్పగారి మాధవికి తృతీయ బహుమతి. డబుల్స్ విభాగంలో నెలవల విజయశ్రీ, మిరియాల శిరీషాదేవి విజేతలు. తంగిరాల సౌమ్య, జగదీశ్వరి రన్నర్స్.


దుర్యోధనుడి వేషంలో రఘురామకృష్ణరాజు

కబడ్డీ: సీఎం జట్టు విన్నర్స్, స్పీకర్ జట్టు రన్నర్స్. మూడోస్థానంలో బుచ్చయ్యచౌదరి టీం.

వాలీబాల్: అయ్యన్నపాత్రుడు టీం విజేత.. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జట్టు రన్నర్స్.

టగ్గాఫ్ వార్: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జట్టు విజయ కేతనం. పురుషుల విభాగంలో బుచ్చయ్యచౌదరి జట్టు ప్రథమ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు జట్టు ద్వితీయ బహుమతి.

త్రోబాల్: అఖిలప్రియ జట్టుకు మొదటి స్థానం. మంత్రి అనిత జట్టుకు ద్వితీయం.

టెన్నికాయిట్: పురుషుల సింగిల్స్‌లో సత్యకుమార్, గద్దె రామ్మోహన్, వంకా రవీంద్రనాథ్‌కు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు. మహిళల డబుల్స్‌లో కర్రి పద్మశ్రీ-అఖిలప్రియ విన్నర్స్. కోళ్ల లలితకుమారి-సింధూరరెడ్డి రన్నర్స్.

క్రికెట్: విజేత మంత్రి నాదెండ్ల మనోహర్ జట్టు. రన్నర్స్‌గా మంత్రి సత్యకుమార్ జట్టు.


బ్యాడ్మింటన్‌లో విన్నర్‌గా నిలిచి బహుమతి అందుకుంటున్న ఎమ్మెల్యే అరవిందబాబు


సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు


ఇదీ సంగతి స్కిట్‌లో జీవీ ఆంజనేయులతో కలిసి ప్రదర్శన ఇస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, అరవిందబాబు


మిర్చియార్డులో అధికారులు, సిబ్బందితో సమావేశమైన మార్కెటింగ్ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయ సునీత

ఒకటికి మించి..

యార్డులో కొన్ని కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ లైసెన్సులు
ఇప్పటికే 134 గుర్తించాం... మరో 27 కూడా జాబితాలో ఉన్నాయి
మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో ఒకే కుటుంబంలో ఒకటి ఎక్కువమందికి లైసెన్సులు ఉన్నవి గుర్తించామని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయసునీత చెప్పారు. ఇలా ఇప్పటికే 134 లైసెన్సులను పటుకున్నాం. మరో 27 కూడా ఇలాంటివే ఉన్నాయి. వీటన్నింటిపై ఒక సమగ్ర నివేదికని రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. మిర్చియార్డులో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించడంతో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత గురువారం మిర్చియార్డు పరిపాలన భవనానికి వచ్చి సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందితో సుదీర్ఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత నెల 22వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు మిర్చియార్డుపై 4 గంటల పాటు సమీక్ష నిర్వహించారని, ఆ సమావేశంలో సీఎం జారీ చేసిన ఆదేశాలను ఏమేరకు అమలు చేస్తున్నారనేది సమీక్షించేందుకు తాను రావడం జరిగిందన్నారు.

రైతుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్య ధోరణి పనికి రాదు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. యార్డులో కొంతమంది వ్యాపారస్థులు ఎలాంటి లైసెన్సులు లేకుండానే మిర్చి వ్యాపారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలానే కొందరు లైసెన్సులు ఉండి ఎలాంటి వ్యాపారలు చేయడం లేదన్నారు. గత మూడు నెలల్లో మిర్చి లావాదేవీలకు సంబంధించి రిపోర్టుని ఇవ్వమని కమీషన్ ఏజంట్లను ఆదేశించాం. ఎవరైతే ఇవ్వరో వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. అలానే ఇంకా జీరో, కటింగ్, బిల్-టూ-బిల్ వ్యాపారాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. మచ్చుకాయలను తీసుకోవడం కూడా నిరోధించడం లేదు. వీటన్నింటిపై కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. మిర్చియార్డులో వ్యాపారం చేయాలంటే నిబంధనల మేరకు లైసెన్సు పొంది ఉండాల్సిందేనన్నారు.

కర్ణాటక నుంచి ఎక్కువ మోతాదులో మిర్చి టిక్కీలను ఇక్కడి కమీషన్ వ్యాపారస్థులు తెప్పిస్తున్నారు. దీని వలన స్థానిక రైతుల మిర్చి నాణ్యతగా ఉన్నా ధర పెరగడం లేదు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకొంటామన్నారు. ప్రస్తుతం మూడో పంట కోతల మిర్చి వస్తున్నది. వాటిల్లో నాణ్యత ఉండటం లేదు. అలానే తాలు, తేమశాతం ఎక్కువ మోతాదులో ఉంటుండటం వలన కూడా ధర పెరగడం లేదన్నారు. ఈ విషయంలో రైతులు సహకరించి బాగా ఎండబెట్టి మిర్చిని గ్రేడింగ్ చేసుకొని యార్డుకు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్లు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, ఏడీ రాజబాబు, సెలెక్షన్‌గ్రేడ్ సెక్రెటరీ ఏ చంద్రిక, వివిధ గ్రేడ్‌ల కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, ఆంజనేయ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సర్వేలతో.. సతమతం

ఒక్కొక్కరికి నాలుగు క్లస్టర్లతో ఇబ్బందే
అంటున్న సచివాలయ ఉద్యోగులు

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వాటర్ టాప్ కనెక్షన్ సర్వే.. హౌస్ హోల్డ్ సర్వే.. ప్రతి ఇంటి జియో టాగింగ్ సర్వే... ఎంఎస్ఎంఈ సర్వే.. చిల్డ్రన్ వితౌట్ ఆధార్ సర్వే... పీ4సర్వే.. వర్క్ ఫ్రం హోం సర్వే... ఇలా చదువుతూ పోతే బోలెడు సర్వేలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ఒకదాని తర్వాత ఒకటి వరుసగా వస్తుండటంతో సచివాలయం ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. అన్ని సర్వేలకు నియమిత కాల వ్యవధి నిర్ణయించడం కూడా ఉద్యోగులను ఒత్తిడికి గురిచేస్తున్నది. అన్ని శాఖల సర్వేలు కలగాపులగంగా ఉండటం కూడా తీవ్ర గందరగోళానికి గురిచేస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 13,424 మంది ఉద్యోగులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. చివరకు సెలవు రోజుల్లో కూడా సర్వేలు చెయ్యాల్సి రావటం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తుంది.

ఒక్కరికీ నాలుగు క్లస్టర్లు...

సర్వేల కోసం గ్రామాన్ని క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో ఉద్యోగికి నాలుగు క్లస్టర్లు తగ్గకుండా వస్తున్నట్లు తెలుస్తుంది. నాలుగు క్లస్టర్లకు సుమారు 250 నుంచి 300 వరకు గృహాలు ఉంటున్నాయి. ఆ గృహాలకు సంబంధించిన పూర్తి బాధ్యత సర్వే చేస్తున్న ఉద్యోగిపై పడుతుందని చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో వార్డు సచివాలయాలు 336, గ్రామ సచివాలయాలు 232, పల్నాడు జిల్లాలో వార్డు సచివాలయాలు 141, గ్రామ సచివాలయాలు 397, బాపట్ల జిల్లాలో వార్డు సచివాలయాలు 69, గ్రామ సచివాలయాలు 408 ఉన్నాయి. వార్డు, గ్రామ సచివాలయాలలో సర్వే వ్యవహారంలో ఒకే సమస్యను ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దివ్యాంగులపై కూడా అదే పనిభారం పడుతుంది. సర్వేల విషయంలో పనిని పంచుకునేందుకు తోటి ఉద్యోగులు ఇష్టపడక పోవడంతో నడవలేని స్థితిలో కూడా కొందరు దివ్యాంగులు ఇంటింటికి తిరగాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఆయా సర్వేలు చేసేందుకు గత ప్రభుత్వం వలంటీర్లకు ఫోన్ లు అందజేసింది. వాళ్ళు రాజీనామా చేసిన తర్వాత తిరిగి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఆ ఫోన్లు మూలన పడేశారు .దాంతో సచివాలయ ఉద్యోగులు సొంత ఫోన్లతోనే సర్వేలు చేస్తున్నట్లు చెబుతున్నారు. మొబైల్ నెట్ బ్యాలెన్స్ కూడా సొంత నిధులతోనే వేస్తున్నట్లు చెబుతున్నారు.

ఆయా విషయాలపై స్పందిస్తూ సర్వేల పేరిట సచివాలయ ఉద్యోగులను తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మధు అన్నారు.



జడ్పీకి.. బకాయిల భారం

రావాల్సిన అద్దెలు రూ.1.22 కోట్లు.. అతిథిగృహాల్లో పేరుకుపోయిన బాకీలు

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అసలే నిధుల లేమితో అల్లాడిపోతున్న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు అద్దె బకాయిలు మరింత తలనొప్పిగా మారాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఇంకా రూ.1.22 కోట్ల వరకు అద్దె బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ అతిథి గృహాల్లో కూడా అద్దె బకాయిలు పేరుకు పోవటం పట్ల జడ్పీ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా అద్దె బాకీలు పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడంతో జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశారు.

జిల్లా పరిషత్‌కు చెందిన పంచాయతీ రాజ్ అతిథి గృహాలు ఉమ్మడి జిల్లాలో ఆరు ఉన్నాయి. వాటి బకాయిలు రూ. 40.94 లక్షల వరకు రావాల్సి ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్‌కు 10 షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వాటి బకాయిలు రూ. 66.85 లక్షల వరకు బాకీలు పేరుకుపోయాయి.

9 పెర్రీలకు రూ. 16.50 లక్షల బాకీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి వసూళ్ల కోసం వెళ్ళటం జరుగుతుంది. పదే పదే హెచ్చరించినా అద్దెలు చెల్లించకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయి అని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ అన్నారు.

పరాశక్తికి అదనపు గనుల రద్దు

◆ అదనంగా ఉన్న 13.899 హెక్టార్ల తొలగింపు ◆ గోలి రిజర్వు ఫారెస్టు హద్దు వద్ద ఉండటమే కారణం ◆ 317.782 హెక్టార్లలో మాత్రమే మైనింగ్‌కి అనుమతి ◆ ఎర్రాట జారీ చేసిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పరాశక్తి సిమెంట్స్‌కి రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం(గోలి) గ్రామంలో కేటాయించిన సున్నపురాయి గనుల్లో అధికంగా ఉన్న 13.899 హెక్టార్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ తొలగించింది. ఈ భూములు గోలి రిజర్వు అటవీ భూమికి సమీపంలో ఉన్నందున ప్రభుత్వం రద్దు నిర్ణయం తీసుకున్నది. దీంతో ఆ సంస్థకు కేటాయించిన 317.782 హెక్టార్లలో మాత్రమే సున్నపురాయి మైనింగ్ చేసుకోవడానికి అనుమతి ఉంటుంది. ఈ మేరకు ఎర్రాటని ప్రభుత్వం జారీ చేసింది. పరాశక్తి సిమెంట్స్‌కి 2011 జూన్‌లో సర్వే నంబరు.494/10, 11, 12లో 180.9089 హెక్టార్లను సున్నపురాయి మైనింగ్ కోసం ప్రభుత్వం కేటాయించింది. లీజు కాలాన్ని 30 ఏళ్లుగా నిర్ణయించింది. 2007 జూన్‌లో జెట్టిపాలెంలోని సర్వే నంబరు.426లో మరో 137.693 హెక్టార్లను 30 ఏళ్ల లీజుకు కేటాయించింది. ఆ తర్వాత ప్రభుత్వం ఈ రెంటింటిని కలిపి 317.900 హెక్టార్లకు ఒక లీజుగా మార్చింది. అలానే లీజు కాలాన్ని 2017లో 50 ఏళ్లకు పొడిగించింది. ఆ తర్వాత 2023లో దాచేపల్లి మైనింగ్ ఏడీ ప్రభుత్వానికి లేఖ రాస్తూ డీజీపీఎస్ సర్వేలో 331.681 హెక్టార్లను గుర్తించారు. అదనంగా ఉన్న 13.899 హెక్టార్ల గనుల్లో ఎలాంటి మైనింగ్ ఆపరేషన్స్ జరగలేదని నివేదించారు. గత ఏడాది సెప్టెంబరులో మైనింగ్ డైరెక్టర్ ఈ మేరకు సమగ్ర నివేదిక అందజేయగా ప్రభుత్వం గురువారం అదనంగా ఉన్న సున్నపురాయి గనులను తొలగించింది. అదేవిధంగా ఆ సంస్థకు 50 ఏళ్లకు కేటాయించిన లీజు ప్రకారం 317.900 హెక్టార్లను ఖరారు చేసింది.

ఉత్సాహంగా విద్యుత్‌శాఖ ఉద్యోగుల పోటీలు

● నేటితో క్రీడలు ముగింపు


పర్యావరణంపై చైతన్యవంతం చేసేలా మహిళా ఉద్యోగి వేషధారణ

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండే విద్యుత్‌శాఖ మహిళా ఉద్యోగులు ఆ శాఖ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గుంటూరులో జరుగుతోన్న క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ఆట పాటలు, క్రీడలతో ఉత్సాహంగా హాజరయ్యారు. ఎన్‌టీఆర్ స్టేడియం వేదికగా క్రీడలు జరుగుతుండగా, సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యుత్‌శాఖలోని మహిళా ఉద్యోగులకు ఈనెల 19 నుంచి 21 వరకు క్రీడా, సాంస్కృతిక పోటీలు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రెండో రోజు గురువారం కూడా క్రీడల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. చెస్, బ్యాడ్మింటన్‌లో సింగిల్స్, డబుల్స్ క్యారమ్స్ డబుల్స, టెన్ని కాయిడ్ విభాగాల్లో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యుత్ భవన్‌లో కూడా ప్రజల్ని చైతన్యవంతం చేసే పర్యావరణానికి సంబంధించిన నాటికలు వేసి స్ఫూర్తి నింపారు. అనంతరం విజేతల పేర్లను ప్రకటించారు. కార్యక్రమంలో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, బాపట్ల ఎస్ఈ ఆంజనేయులు, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు పలువురు అధికారులు ఉన్నారు.

● బకాయిల వసూళ్ళకు రంగంలోకి ప్రత్యేక బృందాలు
● వాహన తనిఖీలు ముమ్మరం
● రైల్వే పార్శిల్స్ రాకపోకలపై స్పెషల్ ఫోకస్

పాత బకాయిలపై...
సీటీ శాఖ కొరడా

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చే కీలక శాఖల్లో ఒకటైన వాణిజ్యపన్నులశాఖ పాత బకాయిల వసూళ్ళపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా ఆ శాఖ అధికారులు పాత బకాయి లు, జీఎస్టీ రిటర్న్ పెండింగ్ జాబితాలోనున్న వారిపై కొరఢా ఝుళిపిస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖలో జూని యర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి నుంచి డీసీటీవో స్థాయి అధికారుల వరకు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి బకాయి వసూళ్ళకు రంగంలోకి దించారు. అత్యవసరమైతే మినహా ఉద్యోగులకు శెలవులు కూడా ఇచ్చేది లేదని మౌఖి కంగా చెప్పినట్లు సమాచారం. గుంటూరు-1, పల్నాడు డివిజన్‌ల జాయింట్ కమిషనర్‌లు శ్రీ లక్ష్మీ, గీతామా ధురీలు బకాయిల వసూళ్ళపై కింది స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వ్యాట్‌లో ఉన్న బకా యిలు కోట్ల రూపాయల్లో ఉన్నట్లు తెలిసింది. ముఖ్యంగా గుంటూరు-1 డివిజన్‌తో పాటు బాపట్ల డివిజన్‌ల పరిధిలోని సర్కిల్స్‌లో ఉన్న పాత బకాయిదారుల జాబితాలను సిద్ధం చేశారు. ఆయా బకాయిల వసూళ్ళ కోసం ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే గుంటూరు రైల్వే స్టేషన్ కేంద్రంగా రైళ్ళలో పార్శిల్స్ రాకపోకలపై వాణిజ్యపన్నుల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉగాది, రంజాన్ పండుగలతో పాటు ఆర్థిక సంవత్సరాంతం కావటంతో పార్శిల్స్‌పై అధికారుల తనిఖీలు ముమ్మరం చేశారు. పార్శిల్స్‌లో వచ్చే ఉత్పత్తులకు బిల్లులను నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. మరో వైపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లోనూ పార్శిల్ ఉత్పత్తులను తనిఖీలు చేస్తున్నారు.


వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం

చర్చనీయాంశంగా మారిన డ్రైవర్ల తొలగింపు

వాణిజ్యపన్నులశాఖలో అక్రమ వసూళ్ళకు పాల్పడ్డారన్న ఆరోపణపై వాహన తనిఖీల విదుల నుంచి పది మంది వరకు ప్రైవేటు వాహన డ్రైవర్ల తొలగించటం ఆ శాఖలో కలకలం రేకెత్తిస్తోంది. 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో గురువారం సీటీ శాఖలో పది మంది డ్రైవర్లపై వేటు అనే కథనం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. కాగా వాహన తనిఖీలు, పన్ను ఏగవేతదారుల నుంచి పెనాల్టీ వసూళ్ళు వంటి వివరాలను ఆ శాఖ అధికారులు కూడా గోప్యత పాటించటం కూడా చర్చనీయాంశంగా మారుతోంది.


జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు

రోడ్డుకు ఇరువైపులా...
భూమి సేకరించాలి

544డీ జాతీయ రహదారి భూసేకరణపై జేసీకి రైతుల వినతి

నరసరావుపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణలో భాగంగా 544డీ జాతీయ రహదారికి ఇరువైపుల భూమి సేకరించాలని రైతులు కోరారు. గురువారం నరసరావుపేట కలెక్టరేట్‌లో జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాకాని, పెట్లూరివారిపాలెం, ఉప్పలపాడు, ఎస్సీ, బీసీ కాలనీల రోడ్డు మార్గాన రోడ్డు కుడివైపు మాత్రమే సర్వేచేసి, కావాల్సిన భూమిని తీసుకోవడానికి ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. రోడ్డు సెంటర్ పాయింట్ నుంచి 74+74=148 అడుగుల ఆర్అండ్‌బీ రోడ్డు ఉందన్నారు. నేషనల్ హైవే 180 అడుగుల అవసరం ఉంటుందన్నారు. రెండు వైపులా భూమిని తీసుకుంటే ప్రభుత్వం వారికి 32 అడుగులు మాత్రమే అవసరం ఉంటుందని చెప్పారు. 16 అడుగుల వంతున ఇరువైపుల రైతుల నుంచి భూమిని సేకరిస్తే ప్రభుత్వానికి కూడా చాలా ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డుకు ఇరువైపుల భూమి సేకరించి రైతులు, రైతు కూలీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం చేయాలని,వ్యవసాయ భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



శ్రీరామ పట్టాభిషేకం చేస్తున్న వేదపండితులు

వైభవంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

చినగంజాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పెదగంజాం గ్రామంలోని భూ, నీళా సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో శ్రీరామకోటి 19వ వార్షిక శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఆలయ అర్చకులు బృందావనం రాఘవ కుమారచార్యులు ఆధ్వర్యంలో యాజ్ఞీకులు పరాకుంశం రఘునాథాచార్యులు, బృందావనం భావనారాయణాచార్యులు, శ్రీనివాస దీక్షితులు, నారాయణం కల్యాణచక్రవర్తి విశ్వక్సేన ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, అష్టాక్షరి, గాయత్రి సీతారామ హనుమ మంత్ర హోమం, కిరీట సమర్పణ తదితర పూజలను నిర్వహించారు. తదనంతరం టీడీపీ వెంకటేశ్వరస్వామి కల్యాణ వ్యాఖ్యాత వాకాని రామకృష్ణశేషసాయి ఆధ్వర్యంలో వేదపండితులు సీతారామలక్ష్మణ, హనుత్‌స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి ఆసోది శివకృష్ణారెడ్డి, పల్లవి, శ్రీనివాసరెడ్డి, వెంకటసాయిప్రసన్న దంపతులచే స్వామి వారికి వేదమంత్రోచ్ఛరణ నడువ శాస్త్రోక్తంగా పట్టాభిషేకం కార్యక్రమాన్ని జరిపారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలని వినియోగం చేశారు. ఈ నెల 10వ తేది నుండి ఆలయ ప్రాంగణంలో పలు గ్రామాలకు చెందిన భజన బృందాలు నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ పారాయణ సహిత హరేరామ నామ సవాహము కార్యక్రమం ముగించింది. ఆసోది నాగేంద్రారెడ్డి, అంకమ్మ దంపతులు ఆలయ ప్రాంగణంలో రెండు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్ ఆసోది దశరథరామిరెడ్డి, ఈవో ఎం.శ్రీనివాసరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇంకొల్లు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు నాగులచెరువుకట్టపై సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. వాకింగు ట్రాక్ ఏర్పాటు, చెరువుకట్టకు ఉత్తరపువైపున కాల్వ నిర్మాణపు పనులకు గురువారం శంకుస్థాపన చేసారు. చెరువుకట్టపై రూ.15 లక్షలతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు చెరువుకట్టకు ఉత్తరపు వైపున మురుగునీరు చెరువులోకి చేరి నీరు కలుషితం అవుతుండగా, అక్కడ సుమారు రూ.34లక్షలతో కాలువ నిర్మాణం చేయనున్నారు. గురువారం జరిగిన భూమిపూజ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వలేరు మార్క్, కరి శ్రీనివాసరావు, బోడావుల శివయ్య, వినోద్ పాల్గొన్నారు.

కంది పంట అగ్నికి ఆహుతి

- ఫైర్ ఇంజన్లకు అదుపు కాని మంటలు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పామూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాపు మీద ఉన్న కంది పంటకు కొందరు ఆకతాయిలు అంటించిన మంటలకు దగ్ధమైంది. గురువారం మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో కంది పంటకు అనుకోకుండా మంటలు అంటుకున్నాయి. సుమారు 150 ఎకరాల్లో కంది పంట అగ్నికి ఆహుతి అయ్యింది. మంటలను అదుపు చేసేందుకు కనిగిరి, కందుకూరు నుంచి ఫైర్ ఇంజన్లు యత్నించినా సాధ్యం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కంది కింటాకు రూ.7,550 మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో రైతులు కంది కోతలు ప్రారంభిస్తు తరుణంలో ఇలా జరగటంతో తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు రూ. 25 వేలు ఖర్చు పెట్టామని రైతులు పేర్కొన్నారు. అగ్నికి ఆహుతి అయిన కంది పంటను తహసీల్దార్, మండల వ్యవసాయాధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలనిమండల తెలుగు రైతు సంఘం మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, నాయకులు గోళ్ల వీరబాబు, ఏలూరి నరశింహారావు, గోళ్ల బాస్కరరావు, రమణయ్య పేర్కొన్నారు. బాధిత బాదిత రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

దిగుబడులు లేక.. ధర రాక

- ఎకరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడి
- నిండాముంచిన తెగుళ్లు
- మిర్చి రైతుల ఆందోళన

ముండ్లమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్చి సాగుచేసిన రైతులకు కాయలు కోయ కుండానే కన్నీళ్లు వస్తున్నాయి. గిట్టుబాటు ధరలేక రైతులు నష్టాలు మూట గట్టుకుంటున్నారు. ఈఏడాది ఖరీఫ్, రబీలో కలిపి రూ.2555 ఎకరాలు సాగుచేశారు. వరుస తెగుళ్ల నిండా ముంచాయి. ఫైరు ఎదుగుదలతో పాటు దిగుబడి తగ్గింది. దీనికితోడు మార్కెట్‌లో ధర పాతాళానికి పడిపోవటంతో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎకరాకు పది నుంచి 15 క్వింటాళ్ళు దిగుబడి వస్తుంది. దీంతో కనీసం పెట్టుబడులతో పాటు కోత, కూలీ ఖర్చు కూడా రాక అల్లాడి పోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉంది.

ఈఏడాది మార్కెట్‌లో ధర లేకపోవటంతో బయట దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులను ఆసరా చేసుకొని రూ.పది వలే నుంచి రూ.12 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. బాగా పండించిన రైతులకు మాత్రం ఎకరాకు 20 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తుంది. ఎక్కువ మంది రైతులు సరాసరి 15 క్వింటాళ్ళ దిగుబడి కూడా రావటంలేదు. మండలంలో అత్యధికంగా ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, సుంకరవారిపాలెం, తమ్మలూరు, పసుపుగల్లు, శంకరాపురం, జమ్మలమడక, రామకృష్ణాపురం, మారెళ్ళ, గంగన్నపాలెం గ్రామాల్లో మిర్చి సాగును ఎక్కువగా సాగు చేశారు. గత నెల రోజుల నుంచి మిర్చి కోతలు వచ్చాయి. దిగుబడి తగ్గటంతో పాటు ధర కూడా లేక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మిర్చికి మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో ఈఏడాది రెట్టింపు స్థాయిలో సాగు చేశారు. తీరా తెగుళ్ళతో పాటు ధర లేకపోవటంతో నష్టాల బాట పట్టారు.

ఈ ఏడాది మిర్చికి ఆరంభం నుంచే జెమినీ, నల్లి, తామర, కొమ్మ తెగుళ్ల సోకాయి. తెగుళ్ళను అదుపు చేసేందుకు వివిధ రకాల మందులు వాడినా అదుపులోకి రాలేదు. దీంతో పెట్టుబడి పెరగగా, దిగుబడి తగ్గిపోయింది. దానికితోడు ధర కూడా అంతంత మాత్రంగానే ఉంది.

నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

ఇప్పటికే పలు శాఖలపై స్పష్టత

అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల కోసం పలువురు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటికే అత్యధిక నామినేటెడ్ పదవులపై ఆయా నేతలకు స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కాలం దాటడంతో ఆశావాహులు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో ప్రధానంగా రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలు, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరశింహస్వామి దేవస్థానాల ధర్మకర్తల మండలి పదవులతో పాటు 31 సొసైటీలకు నామినేటెడ్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. వీటితో పాటు మిగిలిన పలు దేవాలయాలకు కూడా ధర్మకర్తల మండళ్లు నియమించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కూటమి నేతలు ఎవరికి వారే తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అయితే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నామినేటెడ్ పదవులపై ఆయా మండలాల, గ్రామాల నేతలతో చర్చించి పూర్తి స్థాయిలో కసరత్తు చేసి ఒక స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తుంది. అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో కొరిశపాడు మండలానికి కేటాయించే అవకాశం కనిపిస్తుంది. సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఓసీ జనరల్‌కు రిజర్వు కావడంతో సంతమాగులూరు మండలంలోని



అద్దంకి మార్కెట్ యార్డ్ కార్యాలయం

టీడీపీ నేతకు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఇక డైరెక్టర్లుగా అన్ని సామాజిక వర్గాలకు ప్రధాన్యం ఇస్తూ భర్తీ చేసే అవకాశం ఉంది. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆనవాయితీగా వస్తున్న ఆర్యవైశ్య సామాజిక వర్గానికి కేటాయించే క్రమంలో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న అద్దంకి పట్టణ నేతకు లైన్ క్లియర్ అయినట్లు సమాచారం. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్‌గా పట్టణంలోని వడ్డెర సామాజికవర్గానికి చాన్స్ దక్కనుంది. సుదీర్ఘ కాలం నుంచి టీడీపీకి సేవలందిస్తున్న నేతకు ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఆయా నేతలకు పదవులపై స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. నియోజకవర్గంలో మొత్తం 31 సొసైటీలు ఉండగా, ఇంకా ఎన్నికలు జరగకపోవడంతో త్రీమేన్ కమిటీలను నియమించనున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని సొసైటీలకు జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. కొద్ది సొసైటీల విషయంలో ఆయా గ్రామాల నేతలు పోటీపడ్డప్పటికీ చర్చించి అందరి ఆమోదయోగ్యంగా జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. బల్లికురవ, రావినూతల, వెల్లలచెరువు సొసైటీలకు ఎక్కువ మంది పోటీ పడినట్లు తెలుస్తుంది. ఎవరికి వారే మంత్రి గొట్టిపాటిని కలిసి తమకు అవకాశం కల్పించాలని తీవ్ర ప్రయత్నాలు కూడా చేసినట్లు సమాచారం. బల్లికురవ సొసైటీ విషయంలో ఇద్దరు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. త్వరలో అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేసే అవకాశం ఉండడంతో పూర్తి స్థాయిలో జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దీంతో 9 నెలలుగా ఎదురు చూస్తున్న నేతలకు త్వరలో పదవులు దక్కే అవకాశం కనిపిస్తుంది.

సరిచేయకుంటే.. మీపని సరి

- ఒరిగిన కరెంట్ స్తంభాలు
- ఆందోళన చెందుతున్న రైతులు

అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం విద్యుత్ శాఖకు కచ్చితంగా వర్తిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రమాదాలు జరగకముందు ఎన్ని సార్లు చెప్పినా విద్యుత్ శాఖ అధికారులు పెడచెవిన పెడతారని, ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే అప్పుడు మాత్రం ఆఘమేఘాల మీద పరుగులు తీసి పనులు చేస్తారని పలువురు రైతులు అంటున్నారు. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఊరచెరువు కట్ట వెంబడి దామావారి పాలెం నుంచి ఇటుక బట్టీల వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. వాటిలో ఆరు పోల్స్ ఒరిగిపోవడంతో అటువైపు వెళ్లే రైతులు బిక్కు బిక్కు మంటూ వెళ్తున్నారు. ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే కరెంట్ స్తంభాలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.



అద్దంకి పట్టణంలోని ఊరచెరువు కట్ట వెంబడి ఇటుకబట్టీల రోడ్డులో ఒరిగిన స్తంభాలు



పూర్తి గా ఒరిగి ఉన్న కరెంట్ పోల్

వెలిగొండ ప్యాకేజీ-4కు రూ.282.33 కోట్ల అదనపు నిధులు

అధికంగా ఆయకట్టు, పలు కీలక పనులు ఇందులోనే..

ఒంగోలు మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు ప్యాకేజీ-4 పనులకు రూ.282.33 కోట్లు అదనపు నిధులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించి పరిపాలనా ఆమోదం తెలియజేస్తూ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జీ.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు పరిధిలో మూడొంతులు ఆయకట్టుకు నీరందించే తూర్పు ప్రధాన కాలువ, కాకర్ల డ్యామ్ నిర్మాణం, పలు మేజర్ కాలువలు, చిన్న, పెద్ద రిజర్వాయర్, అధిక సంఖ్యలో బ్రిడ్జిలు, చప్టాలు ఈ ప్యాకేజీలోనే ఉన్నాయి. వెలిగొండ ప్రాజెక్టు మొత్తం పనులను ఏడు ప్యాకేజీలుగా విభజించి చేస్తున్న విషయం విదితమే. తొలిదశ పనులకు మూడు ప్యాకేజీలు పూర్తిగా, నాల్గవ ప్యాకేజీలో కొంతభాగం ఉన్నాయి. రెండవ దశలో ప్యాకేజీలో మిగిలిన పనులతో పాటు 5, 6, 7 ప్యాకేజీలు ఉన్నాయి. జిల్లాలోని కనిగిరి, గిద్దలూరు, మార్కాపురంలోని కొంతభాగం అలాగే నెల్లూరు, కడప జిల్లాల ఆయకట్టుకు నీరిచ్చే ప్రధాన పనులు అన్ని 4వ ప్యాకేజీలో ఉండగా 2005లో తొలిదశ పనులకు శ్రీకారం చుట్టారు. అందులోభాగంగా ప్యాకేజీ 4లో కీలకమైన కాకర్ల డ్యామ్ నిర్మాణానికి రూ.39.78 కోట్లు ఇచ్చి పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అనంతరం లింకు కాలువలు, చప్టాలు, బ్రిడ్జిలు, హెడ్ రెగ్యులేటరీల నిర్మాణాలు, ఇతర పనుల కోసం 2005-06లో సుమారు రూ.206.80 కోట్లు, అలాగే 2008-09లో మరో రూ.212.61 కోట్లు వెరసి మొత్తం ఈ ప్యాకేజీ కోసం రూ.482.45 కోట్లకు అనుమతులు ఇచ్చారు. తదనుగుణంగా పనులు జరుగుతున్నాయి. ప్యాకేజీ-4లో కీలకమైన కాకర్ల డ్యామ్ నిర్మాణం పూర్తయింది. తొలిదశలో ఈ ప్యాకేజీలో 44.62 కి.మీ తూర్పు ప్రధాన కాలువ తవ్వకం చేయాల్సి ఉండగా 99శాతం పూర్తయింది. అలాగే సగం స్ట్రక్చర్ల నిర్మాణాలు పూర్తిచేశారు. రెండవ దశకు సంబంధించి చాలా పనులు చేయాల్సి రాగా ప్యాకేజీ-4 పనులు పూర్తికి గతంలో దాదాపు 15ఏళ్ల క్రితం నాటి ధరల ప్రకారం వేసిన అంచనాలు ఉన్నాయి. పనులలో అధిక భాగం ప్రస్తుతం జరుగుతున్న నేపథ్యంలో సవరించిన అంచనాల ప్రకారం ప్యాకేజీ మొత్తాన్ని రూ.764.79 కోట్లకు ప్రాజెక్టు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఆ ప్రతిపాదనలను పరిశీలించి గతంలో అనుమతులు ఉన్న రూ.482.50 కోట్లు పోను అదనంగా రూ.282.33 కోట్లుకు అనుమతులు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.



ఈత సరదా సరే... ప్రమాదం జరిగితే...

విద్యార్థులు, చిన్నారులకు ఈత సరదా. కానీ అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే అవకాశం ఉన్నా తల్లిదండ్రులు వదిలివేయడంపై విమర్శలు వస్తున్నాయి. అసలే వేసవి కాలం.. పైగా ఎండలు కాస్తున్నాయి. ఈ తరుణంలో అద్దంకి మండలంలోని శింగరకొండ వద్ద ఉన్న భవనాసి చెరువులో విద్యార్థులు, చిన్నారులు ఈత కొడుతున్నారు. ఇది చూడటానికి సరదాగా ఉన్నప్పటికీ నీరు లోతుగా ఉండడం, తూటు కాడ, తామర ఆకు ఎక్కువగా ఉండటంతో ఒకింత లోపలికి వెళితే ప్రమాదం పొంచి ఉండే అవకాశం లేకపోలేదు. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకొని లోతైన వాగులు, చెరువులలో పిల్లలను ఈతకు వెళ్లకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - అద్దంకి, ఆంధ్రజ్యోతి

రిలయన్స్ బయోగ్యాస్ భూమిపూజకు ఏర్పాట్లు

పీసీపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదయిర్లపాడు రెవెన్యూ వెంగళాయపల్లి సమీపంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుచేస్తుంది. ఇందుకోసం సర్వేనెంబరు 652లో 475.57 ఎకరాల భూమిని రిలయన్స్ కంపెనీకి ప్రభుత్వం అప్పజెప్పింది. ఏప్రిల్ నెలలో ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారు. వెంగళాయపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ప్రతిపాదిత స్థలం వరకు మౌలికంగా అవసరమైన రోడ్డు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఏర్పాటుచేయాలని పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశించారు. ఆ మేరకు పంచాయతీరాజ్ డీటీ శ్రీధర్‌రెడ్డి, విద్యుత్ ఏఈ లక్ష్మీరాజేష్‌లు వెంగళాయపల్లి నుంచి ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న భూమి వరకు రోడ్డు వేయించి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు పరిశీలించారు. ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఎక్స్‌కవేటర్‌లతో జంగిల్ క్లియరెన్స్ చేయించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ తిరుపాలయ్య, వీఆర్వో రసూల్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నదమ్ములు అభి, పాల్ మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

చెరువులో పడి అన్నదమ్ముల మృతి

కురిచేడులో విషాదఛాయలు

కురిచేడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి అన్నదమ్ములు మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం కురిచేడులోని పడమర హరిజనవాడలో చోటుచేసుకుంది. బత్తుల నరసింహులు కల్పన దంపతుల కుమారులు అభి (10), పాల్ (8) స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 5, 3వ తరగతులు చదువుతున్నారు. సాయంత్రం వారింటికి ఇంటికి దగ్గరలో ఉన్న చిన్న చెరువుకు బహిర్భూమికి వెళ్ళారు. ప్రమాదవశాత్తు అభి చెరువులో జారి పడిపోయాడు. దీనిని గమనించిన తమ్ముడు పాల్ పరుగున తమ ఇంటి సమీపంలో ఆడుకుంటున్న మరో బాలుడిని తీసుకుని చెరువు వద్దకు వచ్చాడు. అన్న కనపడక పోవడంతో రక్షిస్తానంటూ చెరువులోకి దూకబోయాడు. పక్కనే ఉన్న పిల్లవాడు వారిస్తున్నా వినకుండా పాల్ సైతం అన్నకోసం చెరువులోకి దూకి నీటిలో మునిగిపోయాడు. వెంటనే పక్కనే ఉన్న బాలుడు ఈ విషయాన్ని పిల్లల కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు వెంటనే వెళ్ళి చెరువులో వెతికి పిల్లల మృత దేహాలను బయటకు తీశారు. ఇద్దరు పిల్లల మృతితో నరసింహులు, కల్పనలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, గ్రామంలో ఎవరికి ఏ అసవరం వచ్చినా చెరువులో మట్టిని తవ్వుకుంటారు. దీంతో చెరువులో గుంతలు ఏర్పడి వాటిల్లో నీరు నిలుస్తుంది. ఆ గుంతల లోతు ఎవరికి అర్థం కావడం లేదు. చిన్నారులు సైతం ఆ గుంతల లోతు అర్థంకాకనే దిగి మునిగి ఉంటారనే గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

తర్లుపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం పోతలపాడులో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ శీను(50) తనకున్న 4 ఎకరాల భూమితోపాటు మరో 2 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, టమాటా, కంది పంటలను సాగు చేశాడు. ఈ ఏడాది కూడా 3 ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. వరుసగా మూడేళ్ల నుంచి వేసిన పంటలు తెగుళ్ల బారిన పడటంతో దిగుబడులు రాలేదు. వచ్చిన కొద్దిపాటి పంటకు గిట్టబాటు ధర లేకపోవటంతో సుమారు రూ.10 లక్షల మేర అప్పులయ్యాయి. ఇటీవల మిర్చి బస్తాలను యార్డుకు తీసుకెళ్లగా సరైన ధర పలకలేదు. దీంతో అయినకాడికి అమ్ముకుని వచ్చాడు. విషయం తెలిసిన అప్పులిచ్చినవారు బాకీ తీర్చాలని గట్టిగా ఒత్తిడి చేశారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో బుధవారం రాత్రి మిర్చికి పిచికారీ చేసేందుకు తెచ్చుకున్న పురుగు మందును తాగాడు. గంట తర్వాత కుటుంబసభ్యులు గమనించి హుటాహుటిన మార్కాపురంలోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తర్లుపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు శ్రీను మృతితో కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు.

ఏఆర్ ఎస్ఐ రవి సస్పెన్షన్

- తాలూకా ఎస్ఐనంటూ వసూళ్లకు దిగిన వైనం
- చర్యలు తీసుకుంటూ ఐజీ ఉత్తర్వులు

ఒంగోలుక్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తాను సివిల్ ఎస్ఐనంటూ వసూళ్లకు దిగిన ఏఆర్ ఎస్ఐ కే.రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీసు శాఖలో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్న రవికుమార్ ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీకి వెళ్లి తాను ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నానని అధికారులకు గెట్ టూ గెదర్ కార్యక్రమం ఉందని చెప్పాడు. అందుకు రూ.2 లక్షలు నగదు కావాలని కోరాడు. ఈ మేరకు కళాశాల యజమాని రూ.2లక్షలు ఇచ్చారు. కొద్దిరోజులు తర్వాత ఈ విషయం కళాశాల యజమాని, తాలూకా సీఐకి తెలియపరిచారు. దీంతో సీఐ విస్తుపోయి తనకు తెలియకుండా డబ్బులు తీసుకున్న ఎస్ఐ ఎవరని విచారణ చేశారు. ఫోన్ నంబరు ఆధారంగా ఏఆర్ ఎస్ఐ రవికుమార్ అని తేల్చారు. ఈ మేరకు సీఐ అజయ్‌కుమార్ ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శాఖాపరమైన విచారణ చేసిన అనంతరం గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీకి నివేదిక అందజేశారు. ఆ మేరకు ఆయన ఏఆర్ ఎస్సై రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజీవ్ స్వగృహాలకు మోక్షమెప్పుడో?

- సామాన్యులకు సొంతింటిని అందించేందుకు 2008లో నిర్మాణాలు ప్రారంభం
- 50 ఎకరాల్లో 598 ఇళ్లకు శ్రీకారం
- ఎన్నో అవాంతరాలతో అప్పుడప్పుడూ నిర్మాణాలు
- 402 ప్లాట్లకు కలగని మోక్షం, 176 ప్లాట్ల విక్రయాలు

వేటపాలెం (చీరాల), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ, నీడ అనేది కచ్చితంగా ఉండాల్సిన కనీస అవసరం. అయితే దీనిని ఎంచుకునే మార్గాలు మాత్రం వారి స్థితిగతులు, జీవన ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. అయితే అరకొర ఉపాధి అవకాశాలతో బతుకు బండి లాగేవాళ్లకు కనీసం గంజి నీళ్ల, సొంత చిన్న ఇల్లు జీవితంలో కలగానే మిగులుతుంది. ఈక్రమంలో 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యులకు సొంతిల్లును అందిస్తామని, ఇంటి నిర్మాణాలు చేసి ఆక్షన్‌ల ద్వారా ఇల్లు అందిస్తామని ప్రకటించింది. అయితే దీంతో చిగురించిన ఆశలు, రెట్టించిన ఉత్సాహంతో అప్పట్లో ఆక్షన్‌లో పాల్గొనేందుకు మీ-సేవల ద్వారా నామమాత్రపు చెల్లింపును ప్రవేశ పెట్టడంతో అప్పట్లో చీరాల పరిధిలో సుమారు 15 రోజుల పాటు సామాన్య ప్రజలు బారులు తీరారు. పెద్ద ఎత్తున అర్జీలను అందజేశారు.


శిథిలమవుతున్న గృహాలు
బేస్‌మట్టం స్థాయిలోనే నిలిచిన నిర్మాణాలు

అనుకున్నది ఒక్కటి.. అయినది మరొక్కటి

అయితే అప్పట్లో ప్రజలు చీరాల పట్టణానికి సమీపం లేదా ప్రజల నివాసాల మధ్య ఇళ్ల ఏర్పాటు జరుతాయని ఆశాభావంతో అర్జీలకు పోటీ పడ్డారు. కానీ తీరా గృహ నిర్మాణాలు వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం వద్ద జరగడంతో నిరాశతో చాలామంది ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన నగదును వెనక్కి తీసుకున్నారు. ఈక్రమంలోనే అధికారులు నిర్దేసించిన స్థలంపై అనుకూలత లేని ప్రజల్లో చాలా మంది గృహాల ఆక్షన్‌లకు కొ వా డా దూరంగా ఉన్నారు. దీంతో అప్పట్లోనే నిర్మాణాలపై ప్రజల్లో భిన్న స్వరాలు వినిపించాయి.

నిర్మాణాలు..ఆక్షన్‌లు ఇలా

అయితే తలపెట్టిన లక్ష్యంతో అధికారులు చల్లారెడ్డిపాలెం పంచాయతీలో సుమారు 50ఎకరాల విస్తీర్ణంలో వివిధ దశల్లో 598 ప్లాట్లు సుమారు రూ.16కోట్ల వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించారు. అయితే ఆదిలోనే ఆటంకం ఏర్పడింది. నిర్దేసించిన స్థలంలో సుమారు ఎకరన్నర భూమి కోర్టు పరిధిలోకి చేరింది. అప్పటి నుంచే ప్రారంభమైన వివిధ సమస్యల కారణంగా నిర్మాణాలు ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని ప్లాస్టింగ్, పెయింటింగ్ వరకు పూర్తి చేయగా, మరి కొన్ని బేస్‌మట్టంలోనే ఆగిపోయాయి. అయితే 2018లో అప్పటి ప్రభుత్వం జీవో నెంబర్ 243 విడుదల చేసి ఆక్షన్‌లు నిర్వహించాలని ఆదేసించింది. దీంతో ఇప్పటిక నిర్వహించిన మూడు పాటల్లో 176 వరకు అమ్మకాలు జరగ్గా, 400కి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తానికి ధర అధికం, స్థలం సుదూరం కావడంతో ప్రజలు వీటికి దూ రంగా ఉంటున్నారు. దీంతో నిర్మాణాలు సాగక లక్ష్యం నీరుగారుతోంది. టీడీపీ కూటమి అయినా దృష్టి సారించి శిథిలమవుతున్న భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆస్తులను కాపాడడంతోపాటు వాటిని పేదలకు అప్పగించి సొంతింటి కలను నెరవేర్చేలా చర్యలు చేపట్టాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

అంతర్గత రహదారుల నిర్మాణాలు చేస్తున్నాం



ఇటీవల మంజూరయిన రూ.3.52 కోట్లతో అంతర్గత రహదారులు, నిర్మాణాలు చేస్తున్నాం. గతంలో జరిగిన ఆక్షన్‌ల కారణంగా సుమారు రూ.6 కోట్లు రెవెన్యూ వచ్చింది. మరో రెండు, మూడు నెలల్లో ఆక్షన్‌లు జరుగుతాయి. నిర్మాణాలు పటిష్టంగా, పారదర్శకంగా ఉన్నాయి. గృహాలు ప్రజాదరణ పొందుతాయి.

- కోటేశ్వరరావు, రాజీవ్ స్వగృహ అసిస్టెంట్ మేనేజర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

మోడల్ స్కూళ్లతో విద్యార్థులకు భవిష్యత్

అద్దంకిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసి మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తుందని ఇది విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరమని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఎంఈవో-2 బూదాటి సుధాకరరావుతో కలిసి మండలంలోని పలు పాఠశాలల స్కూల్ కమిటీ ఛైర్మన్‌లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఏఏ గ్రామాలలోని పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా మారుస్తున్నారు, ఏఏ గ్రామాలలో అందుకు అంగీకరించలేదు అనే విషయాలను విద్యాశాఖ అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి పక్క, కాలనీలోనే బడి ఉండాలనే ఉద్దేశంతో ఎవరూ మాట్లాడవద్దని ప్రభుత్వం 1 నుంచి 5 తరగతి వరకు ఒక చోట పెట్టి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఏర్పాటు చేసి మోడల్ స్కూల్‌గా మారుస్తుందన్నారు. మోడల్ స్కూల్ ఉపయోగాలపై స్కూల్ కమిటీ ఛైర్మన్‌లు అవగాహన కలిగి అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, పలు పాఠశాలల విద్యా కమిటీ ఛైర్మన్‌లు పాల్గొన్నారు.

రమణాయపాలెంలో ఎత్తిపోతల పరిశీలన

రమణాయపాలెం (పర్చూరు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రమణాయపాలెంలోని ఎత్తిపోతల పథకాన్ని విశ్రాంత ఇంజనీరింగ్ అధికారి సత్యనారాయణ రైతులు, టీడీపీ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆయా పథకాల పనితీరు, మరమ్మతులు తదితన అంశాలను పరిశీలించి నివేదిక తయారు చేసి అందించేవిధంగా ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా విశ్రాంతి డీఈ నేతృత్వంలో ఆయా పథకాలను పరిశీలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రమణాయపాలెం ఎత్తిపోతలను పరిశీలించినట్లు వారు తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొనేవారికి రిజర్వేషన్‌లు

వేటపాలెం(చీరాల), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్తమంగా రాణిస్తే వారికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యాన్ని అమలు చేస్తారని కెప్టెన్ చైతన్య, శిక్షకులు కర్ల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శేఖరరావు ఆధ్వర్యంలో వివిధ తరగతులకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులకు స్కౌట్స్, అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రధానోపధ్యాయుడు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గనడం వలన దేశభక్తి, సామాజిక దృక్పథ, వ్యక్తులపై గౌవరం పెరుగుతుందని, విద్యార్థులతో సంబంధిత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది అన్నమనేని రామస్వామి మృతి

పలువురి నివాళి


అన్నమనేని రామస్వామి


అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీనియర్ న్యాయవాది అన్నమనేని రామస్వామి (90) వయోభారంతో హైదరాబాద్‌లో బుధవారం రాత్రి మృతి చెందారు. రామస్వామి మృతదేహాన్ని గురువారం అద్దంకి తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. రామస్వామి చీమకుర్తి మండలం పల్లామల్లిలో 1935 జులై1నలో వీరయ్య, రంగమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యను పల్లామల్లి, హైస్కూల్ విద్యను ఒంగోలులోని పీవీఆర్ హైస్కూల్, డిగ్రీ గుంటూరు ఏసీ కళాశాలలో పూర్తి చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో లా పూర్తి చేశారు. బార్ కౌన్సిల్‌లో 1961లో సభ్యత్వం పొందారు. అనంతరం ఒంగోలులోని కరవది వెంకటేశ్వర్లు వద్ద జూనియర్ లాయర్‌గా పనిచేశారు. 1983 వరకు ఒంగోలు కోర్టులో న్యాయవాదిగా పనిచేసి అనంతరం అద్దంకి కోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 9 పదుల వయస్సులోనూ ఇటీవల వరకు కోర్టుకు వెళ్లి కేసులు వాదించారు. రామస్వామికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మేదరమెట్ల రోడ్డులోని వెంకటస్వామి టవర్స్‌లో రామస్వామి మృతదేహం వద్ద పలువురు న్యాయవాదులు, ఇతర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం సాయం త్రం అద్దంకిలోని నర్రావారిపాలెం శ్మశానవాటికలో అంతిమ సంస్కారం నిర్వహించారు.

ఓటర్ కార్డ్‌కు ఆధార్‌ను లింక్ చేయాలి

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలింగ్ కేంద్రాలలో ఓటరుకు ఆధార్ నెంబర్ లింకు చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను విచారణ చేసి సంబంధిత రిపోర్టును తహసీల్దారు కార్యాలయానికి పంపించాలని తహసీల్దారు కే రవికుమార్ అన్నారు. గురువారం యద్దనపూడి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో తహసీల్దారు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో బీఎల్‌వోలకు ఆయన పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు విష్ణుప్రసాద్, సాంబశివరావు, సీనియర్ అసిస్టెంట్ టి భాస్కరరావు, పలువురు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్


మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ కార్డులను అందజేస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలో వేటతో జీవనం సాగిస్తున్న మత్స్యకార సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళిక చేస్తున్నట్లు నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి మత్స్యకారులకు అందించే డీజిల్ సబ్సిడీ కార్డులను స్వయంగా అందజేశారు. ఈసందర్భంగా స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పోర్టు నిర్మాణం, టూరిజం వంటి వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. అలాగే నిషేధ కాలంలో భత్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరికీ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీలో వసతుల పరిశీలన


గ్రామస్థులతో మాట్లాడుతున్న గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి

అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ ముంపు గ్రామమైన ధేనువకొండ పునరావాసకాలనీలలో ఒకటైన దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీని గురువారం గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) పరిశీలించారు. పునరావాస కాలనీలో ప్రస్తుతం ఉన్న వసతులు, కల్పించాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఇంకా ఇళ్ల స్థలాల కేటాయింపు జరగని కుటుంబాలు, శ్మశానవాటిక సమస్య, మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలను గ్రామస్థులను వివరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరి, టీడీపీ నేతలు జొన్నలగడ్డ కృష్ణ, నలజల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ ఆంజనేయులు, చ క్రవరం అంజంరాజు, అన్నాబత్తిన హనుమంతరావు, కొండలు, జొన్నలగడ్డ పేరయ్య, గుంజి గోవింద్ పాల్గొన్నారు.

గొనసపూడిలో శనగల కొనుగోలు కేంద్రం

చినగంజాం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామంలోని చింత గుంపల్లె పీఏసీఎస్‌లో శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి కే.భాస్కరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్‌లో మండల పరిధిలో వేసిన శనగ పంట కొనుగోలు చేసేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జేజే11 రకం శనగ పంట మద్దతు ధర క్వింటా రూ.5,650గా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. శనగ పంట సాగు చేస్తున్న రైతులు గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రంలో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకొని శనగ పంటను మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోరారు.

నేడు గురు చెన్నాదాసు ఆరాధనోత్సవం

సంతమాగులూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరులోని శ్రీ ఆవుల మంద గురు చెన్నా దాసు 134వ ఆరాధన మహోత్సవం జరుగుతుందని చెన్నా దాసు గ్రామ కమిటీ నాయకులు ఆవుల మంద ఓంకార్, చెన్నా దాస్ తెలిపారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సీఎంకు డక్కలి కులస్థుల కృతజ్ఞతలు


మోదీ, చంద్రబాబు, కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డక్కలి కులస్థులు

మార్టూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : డక్కలి కులస్థులను గుర్తించి, వారిని ఎస్సీ వర్గీకరణలో చేర్చినందులకు కూటమి ప్రభుత్వానికి మార్టూరులోని ఆదిజాంబవంతుకాలనీలోని డక్కలి కులస్థులు గురువారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఒ క ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఎంతోకాలంగా గుర్తింపునకు నోచుకోకుండా ఆదరణ కోసం నాయకులచుట్టూ తిరుగుతున్న డక్కలి కులస్థులకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇవ్వడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకాన్ని చేశారు. కార్యక్రమంలో డక్కలి సంఘ నాయకులు నాయకులు బాబు, యల్లమంద, సాయిబాబు, టీడీపీ నాయకులు కాకోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉల్లాస్ సాక్షరతా కార్యక్రమంపై అవగాహన


మాట్లాడుతున్న వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు మనోరంజన్

పర్చూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వయోజన విద్యాశాఖ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమంపై వెలుగు కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన విద్యాశాఖ పర్యవేక్షకుడు కొణిదల మనోరంజన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువురాని వయోజనులకు (15, అంతకంటే ఎక్కువ వయస్సు) గల వారికి పనుల్లో ఉపయోగపడేలా చదవడం, రాయడం, లెక్కలు చేసుకోవటం నేర్పటమే ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమం ఉద్దేశమన్నారు. కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయ బృందాలలో మొదటి విడతగా చదువురాని 590 మంది మహిళలను గుర్తించి వారికి, వారి బృందాలలోనే చదువుకున్న మహిళలతోనే చదువు నేర్పించడం జరిగిందన్నారు. వయోజన విద్య ద్వారా అక్షరాశ్యత సాధించిన వారికి ఎన్ఐవోఎస్ ద్వారా ధ్రువీకరణ పత్రాలను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కొండి రామకృష్ణ, సీసీలు, వివిధ గ్రామాల యానిమేటర్లు, టీచర్స్ పాల్గొన్నారు.

కారంచేడు : కారంచేడు వెలుగు కార్యాలయంలో ఉల్లాస్‌పై ఏపీఎం టి.మోహన్ రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు రైతుల సమస్యలను వివరిస్తున్న ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఆలేరు వాగు ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్

దగ్గుబాడు (పర్చూరు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల పరిధిలో ఆలేరు వాగు నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు త్వరితగతిన నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు గంటా విజయ్‌కుమార్ కోరారు. గురువారం సంబంధిత రైతులతో కలసి చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడును కలసి సమస్యలు వివరించారు. గజిట్ పబ్లికేషన్ పూర్తై పక్షం రోజులు గడిచిందని, త్వరితగతిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కాలువ నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములను ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కారంచేడు తహసీల్దార్ నాగరాజు, ఇంకొల్లు తహసీల్దార్ వెంకటరత్నం, ఆలేరు వాగు రైతులు గుమ్మడి రామ్మోహన్‌రావు, మార్నేని కృష్ణ, మానం శ్రీనివాస్, నాయుడు సుబ్బారావు, నిమ్మల వేణు, నార్ని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 21 మంది ఎంపిక

అద్దంకిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ మేళాలో అమరరాజా, హెచ్‌డీఎస్ బ్యాంక్, ఐఆర్‌ఎస్‌టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 39 మంది హాజరుకాగా వారిలో 21 మంది అభ్యర్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ లాజరేస్‌బాబు తెలిపారు. జాబ్ మేళాలో పొందిన ఉద్యోగాలను యువత సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గోపినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, మార్చి15(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సంతమాగులూరు మండలంలో పలు కార్యక్రమాలలో హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు గురిజేపల్లి, 10-30 గంటలకు చవిటిపాలెం, 11 గంటలకు సంతమాగులూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే కార్యక్రమాలకు మంత్రి రవికుమార్ హాజరుకానున్నారు.

వేద పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు ఆహ్వానం

అద్దంకిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కనిగిరిలోని ఆకుమల్ల విశ్వరూపచార్య గురువు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వేద సంస్కృత పాఠశాలలో వి శ్వబ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి గురువారం ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 16 సంవత్సరాలలోపు ఉన్న విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు వాస్తు జ్యోతిష్యం, పంచాంగ పరిజ్ఞానం, ముహూర్త భాగం, మనుసూత్ర ప్రయోగం, సంస్కృతం, పౌరోహితం తదితర కోర్సులకు మూడు సంవత్సరాల కాల పరిమితిలో ఉచిత భోజన, వసతి సౌకర్యం ఏర్పాటు చేసి నేర్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి కలిగిన విద్యార్థులు 9542920400 నెంబరును సంప్రదించి 30వ తేదీలోపు దరఖాస్తులను చేసుకోవాలని కోరారు.

మహిళకు గాయాలు

మార్టూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వెనుక వస్తున్న వాహనం స్కూటీని ఢీకొట్టడంతో మహిళ గాయపడింది. ఎంఎల్ ఏపీ కంపెనీ క్వార్టర్సులో ఉంటున్న మాధవీలత వ్యక్తిగత పనులు నిమిత్తం కుమారుడితో కలిసి స్కూటీపై చిలకలూరిపేట వెళ్లి వస్తున్నారు. ఇంటూరి ఫంక్షన్ హాలు సమీపంలో వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారుడు స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మాధవీలత రోడ్డుపై పడి గాయపడ్డారు. ఆమెను హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పొగాకు చెక్కులతో ఉన్న లారీ మీద నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పల్నాడు జిల్లా, చిలకలూరిపేటలోని సంజీవ్ నగర్‌కు చెందిన కొచ్చెర్ల అజయ్ సాగర్ (20) మరో నలుగురు పర్చూరు మండలం పెద్దవారిపాలెంలో బుధవారం కూలి పనికి వచ్చారు. లారీలో పొగాకు చెక్కులు వేసిన అనంతరం లారీ పైభాగంలో కూర్చున్న సాగర్ లారీ కదిలిన సమయంలో కిందపడి గాయపడ్డాడు. క్షతగ్రాత్రున్ని గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుమందులపై రైతులకు అవగాహన

ఇంకొల్లు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇంకొల్లు రైతులకు గురువారం పురుగుమందు పిచికారీ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కీటక విభాగపు ప్రొఫెసర్ ప్రసన్నకుమారి మాట్లాడుతూ క్రిమిసహారక మరియు పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు దానికి సం బందించిన బిల్లులు తప్పని సరిగి పొందాలన్నారు.పురుగు మందులు పిచికారి చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది ఇంకొల్లు ప్రాంత రైతులు పాల్గొన్నారు.

వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యం

మేదరమెట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : టీబీ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించి, మందులు వాడితే నివారణ సాధ్యమని ఎస్‌టీఎస్ రాజశేఖర్ అన్నారు. గురువారం మేదరమెట్ల జడ్పీ హైస్కూల్‌లో టీబీ లక్షణాలను ఆయన వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, దగ్గినప్పుడు కళ్లెలో రక్తపు చారలు, వాంతులు, జ్వరం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌ను కలవాలని సూచించారు. మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆర్‌టీపీసీఆర్ సెంటర్‌లో కళ్లె పరీక్షలు చేసిన అనంతరం వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తారని రాజశేఖర్ తెలపారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్ఎస్ వెంకటరత్నం, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


టీబీపై అవగాహన కల్పిస్తున్న ఎస్టీఎస్ రాజశేఖర్